AL-HiLaL

నెలవంక

రబీఉస్సానీ నెల్లు శకం 1434

Vol 8, Issue: 65 March - 2012

nelavankaonline.com

مجلة الهلال (باللغة التلغوية) - ملحق مجلة البشرى

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

جمعية النجاة الخيرية

telgo fbrvry.indd 1 3/11/12 11:51 AM

మంచికి దగ్గరగా చెడుకి దూరంగా

"సత్కార్యాలలో, దైవభీతితో కూడిన విషయాలలో ఒండొకరికి తోడ్పడుతూ ఉండండి. పాప కార్యాలలో, దౌర్జన్యపు పనుల్లో ఎవరితోనూ సహకరించకండి. ".

(దివ్య ఖుర్ఆన్- 5: 02)

NIDAVANKA
సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

AL - HILAL
నెలవంక
(AL-HILAL MONTHLY)

Vol 8, ISSUE: 65
March - 2012

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. Abdus Salam Omeri
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97266676

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
ISLAM PRESENTATION COMMITTEE
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal
Zukhruf Advertising Agency
www.zukhruf.net

ఈ సంచికలో....

మానవ మహోపకారి ముమహమ్మద్ (స)

బాధ్యతలను ఉత్తమ రీతిలో నిర్వర్తించండి

తమస్సు తొలిగింది

మూఢాచారాలు మూడు



అభిలాష - శ్రేయోభిలాష	2	ఇమామ్ ముస్లిం (ర)	13
అబుల్ హసన్ ఇబ్నుల్ హైసమ్	3	కదంబం	14
అసలు బాధ ఏది?	4	ప్రవాసాంధ్రులకు	16
హిందూ (వైదిక) మతంలో....	6	ఐపిసి వార్తలు	16
భారత స్వాతంత్ర్యోద్యమం ముస్లింలు	10	తమస్సు తొలిగింది	18
ముస్లిం జీవితానికి సంబంధించిన...	12	బహు భార్యాత్వం	20

كلمة العدد (الفرق بين الإرادة و إرادة الخير) - ابن الهيثم و خدماته في العلم الحديث - الألم الحقيقي - وجود الله و وحدانيته في كتب الهندوسية - فاتح القلوب محمد صلي الله عليه و سلم - إستقلال الهند والمسلمون - تعريف إمام مسلم - خذ عقيدتك من الكتاب والسنة (محمد جميل زينو) - الطبخ الكويتي - نصائح للوافدين - أخبار اللجنة - زالت ظلمة القلب

దృక్పథం

అభిలాష - శ్రేయోభిలాష

దేవుడు మనిషికిచ్చిన మహదానుగ్రహం తన అభిలాషను వ్యక్తపర్చే వాక్ స్వేచ్ఛ - స్వాతంత్ర్యం. ఒకవైపు ఈ మనోవాక్కర్మల స్వేచ్ఛను మనిషి మంచి మార్గంలో వినియోగించిన దైవదూతలకన్నా శ్రేష్ఠ స్థాయికి ఎదుగుతుంటే, మరోవైపు వాటిని చెడు మార్గంలో దుర్వినియోగ పర్చి పశువులకన్నా హీన స్థాయికి దిగజారుతున్నాడు మనిషి. తనకు ప్రాప్తమయి ఉన్న మనోవాక్కర్మల స్వేచ్ఛ, అనుపమ తెలివీ తేటల ఆధారంగా అద్భుతమైన బాహ్య ప్రగతికి బాటలు వేశాడు మనిషి. మహోత్కృతమైన ఆవిష్కరణలకు కారకుడయ్యాడు. అదే సమయంలో ఇవే శక్తీసామర్థ్యాలను గాడి తప్పించి, గజిబిజి సిద్ధాంతాలతో ఒక వైపు సృష్టికర్తను మరచిన మిడిసిపాటుతో తన మేధకు తానే మత్తెక్కి వెర్రి తలకెక్కి ప్రవర్తిస్తుంటే, మరో వైపు సృష్టికే తలమానికం అయిన తన శిరస్సును తనలాంటి, తనకన్నా హీనమైన, బలహీనమైన సృష్టిరాసుల ముందు వంచి, తిత్తరబిత్తర తత్వాలతో తెలివిని తప్పుత్రోవలు త్రొక్కిస్తున్నాడు, వివాహ పూర్వమే సహజీవనం అంటూ, స్వలింగ సంపర్కం అంటూ తన ఉనికికే తలవంపుగా మారుతున్నాడు. ఇట్టి అల్పబుద్ధి ఆలోచనల ఆధారంగా **'భారత లైంగిక స్వతంత్ర పార్టీ'** అన్న పేరుతో ఒక పార్టీకి పునాది వెయ్యాలనుకోవడం సిగ్గుచేటు. నయానో భయానో నీతినియమాలను నిలబెట్టాల్సిన ధర్మాసనమే **'దేశంలో స్వలింగ సంపర్కుల జనాభా వివరాలు కావాల'**ని కోరడం, వారికి వెన్నుదన్నుగా నిలవాలనుకోవడం మిక్కిలి అవమానకరం. నాడైనా, నేడైనా నీతి తప్పింది, తప్పి బ్రతుకుతున్నది నింగో, నేలో కాదు; అక్షరాల మనిషే. మనిషి ఈ ధోరణి అతని విపరీత బుద్ధికి, వినాశ చర్యకి నిదర్శనం. ఆర్థికపరమైన దౌర్జన్యం, నైతిక పరమైన దుర్బుద్ధి ఏ సమాజంలోనైతే చోటు చేసుకుంటుందో ఆ సమాజ మనుగడ ఇక అంతమైపోయినట్టే. దీనికి మానవ చరిత్రే ప్రత్యక్ష సాక్షి!

స్వేచ్ఛ-స్వాతంత్ర్యం అంటే, ఎవరికి వారు నచ్చిన విధంగా అర్థాలు చెప్తారు. అది వాక్ స్వేచ్ఛ అయినా, విశ్వాస (మనో) పరమైన స్వేచ్ఛ అయినా, కోరికల (కర్మ) పరమైన స్వేచ్ఛ అయినా. ఈ విధ మైనటువంటి అర్థాల్లోంచి వచ్చినదే - **'నీ వల్ల ఇతరులకు ఇబ్బంది కలగనంత వరకూ నీవు స్వతంత్రుడవే'** అన్నది. అయితే ఇస్లాం, మనిషిని మహా మనీషిగా ఎదగకుండా, జంతువుగా, జంతువుకన్నా హీనంగా మార్చి వేసే ఇటువంటి స్వేచ్ఛను, అభిలాషను అంగీకరించదు. అంటే, ఒక వ్యక్తిని, బహిరంగ ప్రదేశాల్లో ఒక కార్యం నుండి అది ఆపుతుందంటే ఏకాంతంలో కూడా దానికి దూరంగా మసలుకోవలసిందిగా బోధిస్తుంది. నీ వల్ల ఇతరులు ఇబ్బంది పాలవ్వకూడదు అని చెప్పడంతోపాటే నీ వల్ల నీ స్వయానికి సయితం హాని కలుగకూడదు అని నొక్కి వక్కాణిస్తుంది. అనగా మనిషి అభిలాషలో స్వయం శ్రేయం, సర్వ జీవరాసుల శ్రేయం ఇమిడి ఉండాలన్నది దాని ముఖ్యోద్దేశ్యం. ఈ నిమిత్తం అది - స్వీయ సంస్కరణ చేసుకున్న వ్యక్తిపై సమాజ సంస్కరణ బాధ్యతను మోపితే, సమాజ సంస్కరణలో పడి స్వయాన్ని మరచిపోయిన వ్యక్తిని స్వీయ సంస్కరణ వైపు దృష్టి మళ్ళించమని మందలిస్తుంది.

కాబట్టి భవిష్యత్తులో మానవాభ్యుదయం ఎలా ఉండాలి? ఆ ప్రయత్నంలో మన కర్తవ్యాలు ఏమిటి? అన్న ప్రశ్న ఈనాడు మన ముందుంది. మనం సాధించాల్సిన అభివృద్ధి, అధిరోహించాల్సిన ప్రగతి సోపానాలు, పోరాడాల్సిన విధానాలు, లక్ష్యాలు అశేషంగా ఉన్నాయి. వాటిలో పిల్లల పెంపకం ప్రధానమైనది. పులింగం, స్త్రీలింగం, ద్విలింగం, లింగ శూన్యం అన్న వివక్ష పాటించకుండా మన పిల్లలను మనం ఉత్తమ పౌరులుగా, నలుగురు మెచ్చుకునేలా పెంచాలి. వారికి సంబంధించిన సామాజిక పరమైన హక్కులైతేనేమీ, ఆర్థికపరమైన స్వేచ్ఛయితేనేమీ, విద్యాపరమైన, వైవాహిక పరమైన హక్కులైతేనేమీ, ఉద్యోగ అర్హతయితేనేమీ-అన్నీ వారికి సమాన స్థాయిలో (ప్రభుత్వం అందించకపోయినా) అయినవారమైన మనం అందించేదుకు శాయశక్తుల కృషి చేయాలి. వారిని పెడత్రోవ పట్టించే సాహిత్యాన్ని, సినిమాలను, చేష్టలను నియంత్రించాలి.

చివరగా ఒక మాట - సమాజంలో మార్పు దానంతటది రాదు. వ్యవస్థ మారాలి అంటే దాని మూలమైన మనుషులు - మనం మారాలి. అలా కాకుండా ఇలా చేయాలి, అలా జరగాలి అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ, వ్యాసాలు వ్రాస్తూ కాలక్షేపం చేస్తే మన ఈ నిర్లక్ష్యతకు మనల్ని మనం సమర్థించుకున్నా, కాలం మనల్ని క్షమించదు. ఇంటికి దివ్వెలు పిల్లలు అని గర్వపడే ఆ దీపాలే మన ఇంటికి నిప్పు పెట్టి ఆనంద పడే దుస్థితి రాక మానదు. కాబట్టి, మార్పు కోసం చిన్నదైనా, పెద్దదయినా ఏదోక స్థాయిలో కృషి అవసరం. ప్రయత్నం కావాలంటే బలమైన సంకల్పం అవశ్యంగా ఉండాలి. సామాజిక, స్పృహతోపాటు ధర్మాధర్మాల, న్యాయాన్యాయాల, సత్యాసత్యాల, యుక్తాయుక్తాల విచక్షణ, చిత్తశుద్ధి, అంకితభావం, త్యాగనిరతి లేనిదే ఏ సంకల్పం ఉదయించదు, ఉదయించినా సిద్ధించదు. మార్పు కోసం ముందు మనం, మన మనసులో శ్రేయం కూడిన అభిలాషను అంకురంగా వెయ్యాలి. తీవ్రమైన ఆకాంక్షతో, తపనతో దాన్ని పెంచాలి. అప్పుడు అది మొలకెత్తి, మ్రానై పుష్పించి, సుమధుర ఫలాల్ని సమాజానికి అందిస్తుంది. దీనికి భావ విప్లవం అవసరం. అందుగ్గాను మానసిక చైతన్యం మనందరిలో కావాలి, రావాలి. అటువంటి భావ విప్లవానికి, మానసిక చైతన్యానికి ప్రేరణగా ఆధారంగా నిలిచి, ముందుండి మనల్ని నడిపించేదే అంతిమ దైవ గ్రంథం ఖుర్ఆన్. స్వేచ్ఛ -స్వాతంత్ర్యం గల ఈ ప్రపంచంలో ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ ఈ గ్రంథాన్ని చదివి, ఇతరుల చేత చదివించి, చదివి విన్పించవచ్చు. ఇది దేవుడు తన దాసుల సమస్యల పరిష్కారార్థం అవతరింపజేసిన అంతిమ దైవగ్రంథం. దీని అధ్యాయనం ద్వారా స్వయాన్ని, పల్లెని, పట్టణాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని, ప్రపంచాన్ని త్వరలో సంపూర్ణ శ్రేయోదాయక, శాంతియుత విప్లవాన్ని త్వరితం చేసే సామాజిక స్పృహని, అవగాహననీ, ఆలోచననీ ప్రేరేపిస్తారని, ప్రేరణగా నిలుస్తారని అభిలషిస్తూ...!

అబ్దుస్సలాం

telgo fbrvry.indd 2 3/11/12 11:51 AM

అబుల్ హసన్ ఇబ్నె అల్-హైతమ్ (965 - 1040 క్రీ.శ)



సిద్ధాంతాలతో మనుగడ సాగిస్తున్న సైన్స్‌కు ప్రయోగాలను జత చేసిన శాస్త్రవేత్త-ఇబ్నె అల్ హైతమ్. ఇప్పటికి ఓ వెయ్యి సంవత్సరాల క్రితం ఇబ్నె అల్-హైతమ్ సూక్ష్మాతి సూక్ష్మమైన విషయాల పై ఎన్నో ప్రయోగాలు చేశారు. **'దృష్టి'** (విజన్) గురించి సైంటిఫిక్‌గా వివరించిన తొలి వ్యక్తి ఈయన.

ఫిజిసిస్ట్, ఖగోళశాస్త్రజ్ఞుడైన ఇబ్నె అల్-హైతమ్ ఇరాఖ్‌లోని బస్రాలో జన్మించారు. ఇబ్నె అల్-హైతమ్ యూరప్ దేశీయులకి 'అల్‌హేజన్ గానే తెలుసు.

ఈయన పేరులో ఉన్న 'అల్-హసన్' ని అల్‌హేజన్‌గా లాటిన్ భాషలోకి అనువదించడంతో ఈ గొప్ప శాస్త్రవేత్త పేరు అల్‌హేజన్‌గా యూరప్‌కి పరిచయం అయింది. ఈయన ఇరాఖ్‌లోని బస్రా నుండి వచ్చారు గనుక, ఈయనను కొన్ని సార్లు అల్- బస్రీ అని కూడా పిలిచారు.

ఈయన గురించి ఫౌండేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, యు.కె. వారు ప్రపంచంలో ముస్లిమ్ హెరిటేజ్ గురించి చాలా పుస్తకాలను ప్రచురించారు. వాటిలో అల్-హైతమ్ గురించి క్లుప్తంగా వివరించిన వాటిలో నుండి కొన్ని విషయాలను తీసుకున్నాము.

మనం కళ్ళు మూసుకుంటే మనం ఎవరినీ చూడలేం కదా, అప్పుడు మనల్ని కూడా ఎవరూ చూడలేరా? **'దృష్టి'** (విజన్) కి సంబంధించి మరియు కాంతి విజ్ఞాన శాస్త్రాని (ఆప్టిక్స్)కి సంబంధించి గ్రీకులలో రెండు ప్రధాన సిద్ధాంతాలుండేవి.

అందులో మొదటిది ఏమిటంటే, మనం ఏదైనా వస్తువును చూస్తున్నామంటే, మన కళ్ళ నుండి కిరణాలు ఆ వస్తువును చేరతాయని.

ఇక రెండవ ఐడియా ఏమిటంటే మనం ఏదైనా వస్తువును చూస్తున్నామంటే, ఏదో ఒకటి మన కంటిలో ప్రవేశిస్తుంది, అదే వస్తువును కనిపించేలా చేస్తుంది. ఈ రెండవ ఐడియా సరియైనదే.

కాని అరిస్టాటిల్, గేలెన్ మరియు వారి శిష్యులు ఈ మోడల్‌ని విశ్వసించినా, వారి సిద్ధాంతాలు స్పెక్యులేషన్‌పై ఆధారపడ్డాయే గాని, వాటిని సమర్థించే ప్రయోగాలు వారు చేయలేదు.

అల్-హైతమ్ తొలి వైద్య పరిశోధకుడుగా చెప్పవచ్చు. కాంతి కళ్ళ నుండి రాదని, కాంతి కళ్ళను చేరుతుందని నిరూపించి, గ్రీకు సిద్ధాంతాన్ని తప్పు అని నిరూపించడం జరిగింది. ఇబ్నె అల్-హైతమ్ ప్రకారం **'రెటీనా'** దృశ్యకేంద్రంగా ఉంటుందని, రెటీనాను చేరిన దృశ్యాలు మెదడుకు ఆప్టికల్ నరం ద్వారా పంపబడతాయని, ఆ విధంగా రెండు కళ్ళ నుండి అందిన వాటితో దృశ్యాన్ని మెదడు ఏర్పరస్తుంది.

బస్రాలో పుట్టినప్పటికీ, నైలు నది వరద ప్రభావాన్ని తగ్గించే విషయంలో ఈజిప్టు పరిపాలకుని ఆహ్వానం మేరకు ఆయన ఈజిప్టు వెళ్ళారు. ఫిజిక్స్ (భౌతికశాస్త్ర)నియమాలకు గణితసాస్త్ర అప్రోచ్‌ని జత చేసిన తొలి వ్యక్తి ఇబ్నె అల్-హైతమ్.

కాంతి విజ్ఞానశాస్త్రాన్ని (ఆప్టిక్స్‌ని) అర్థం చేసుకోవాలంటే, భౌతికశాస్త్ర మరియు గణితశాస్త్ర అధ్యయనం తప్పని సరి.

ఇబ్నెఅల్-హైతమ్ **'ఇస్లాం'** గురించి బాగా అధ్యయనం చేసిన వ్యక్తి. **'ఇస్లాం'** పై పరిపూర్ణ విశ్వాసం గల ముస్లిమ్. ఈయన బస్రాకి **'మంత్రి'**గా కూడా పని చేశారు.

ఈ శాస్త్రవేత్తపై, ఈయన చేసిన గొప్ప పరిశోధనలపై గ్రీకువేత్తల ప్రభా వం లేదా అని అడగవచ్చు. గత చరిత్ర లో జరిగిన తప్పిదాలు, మరలా జరగ కుండా ఉండాలంటే గత చరిత్రను అధ్య యనం చేయాలి, అలాగే సైన్స్‌లో కొత్త విషయాలు కనుగొన్న ఏ వ్యక్తి అయినా సరే, అంతవరకూ సైన్స్‌లో జరిగిన అభివృద్ధిని అధ్యయనం చేస్తాడు. వాటిలోని తప్పులను, ఒప్పులను నిరూపించాలి. అదే ఇబ్నె అల్- హైతమ్ చేశారు. ఇబ్నె అల్-హైతమ్, శాస్త్రవేత్తలపై ఎటువంటి ప్రభావం వేశారో జార్జ్ సార్టన్ ఇలా వర్ణించి చెబుతున్నారు:

"ఇబ్నె అల్-హైతమ్ గొప్ప ముస్లిమ్ ఫిజిసిస్ట్ మరియు ఎప్పటికీ కాంతి విజ్ఞాన శాస్త్ర విద్యార్థే. ఇంగ్లాండ్‌లో కానివ్వండి లేదా సుదూర పర్షియా కానివ్వండి, అందరూ త్రాగింది అదే నీటిధార నుండి. బేకన్ నుండి కెప్లర్ వరకూ యూరోపియన్ల ఆలోచనలపై అతడు గొప్ప ప్రభావాన్నే వేశాడు."

telgo fbrvry.indd 3 3/11/12 11:52 AM

హఫీజుల్లాహ్

అసలు బాధ ఏది?

మన మాటల్ని చేతల్ని వట్టి బూటకం అని కొట్టి పారేసినప్పుడు బాధ. మన హక్కుని మనకు దక్కకుండా చేసినప్పుడు బాధ. మనం కూడబెట్టిందంతా ఒక్కసారిగా కుప్ప కూలినప్పుడు బాధ. వయసు పైబడినా కన్న కలలన్నీ కల్లలుగానే మిగిలిపోయినప్పుడు బాధ. మనవారు, మనలో సగం అనుకున్నవారే ద్రోహం చేసినప్పుడు బాధ. ఆప్తులు అసువులు బాసినప్పుడు బాధ. వెన్నుపోటు పొడిచింది వెన్నుదన్నుగా నిలవాల్సినవారే అని తెలిసినప్పుడు బాధ. మనం ప్రాణంకన్నా ఎక్కువగా ప్రేమిస్తున్నవారు మన మనోభావాలతో ఆడుకుంటున్నారని తెలిసినప్పుడు బాధ. ఆశలు చిగురించక ముందే ఆశాభంగం కలిగినప్పుడు బాధ. సదుద్దేశ్యంతో సేవ చేయాలనుకున్నప్పుడు నిందలు పడాల్సి వస్తే బాధ. మనం గౌరవించే వ్యక్తి దగ్గర మనకు మర్యాద దక్కనప్పుడు బాధ. కటుంబ గౌరవం బజారు పాలైనప్పుడు బాధ. చేయని నేరానికి శిక్ష అనుభవించినప్పుడు బాధ. కష్ట కాలంలో ఆప్తులు కూడా ఆదుకోనప్పుడు బాధ.

ఇవి, ఇలాంటి అనేక బాధల్ని మనిషి తన రోజువారి జీవితంలో ఎదుర్కొంటూ ఉంటాడు. 'అనుభవిస్తేనేగానీ ఆ బాధ ఏమిటో తెలియదు' అన్న మాట మనం తరచూ వింటుంటాము. అనుభవిస్తాము గనక అది బాధగా తోస్తుంది. ఐహిక పరమైన ఈ బాధలన్నీ పరీక్ష నిమిత్తం మాత్రమేనని ఆపద్బాంధవుడు అయిన అల్లాహ్ సెలవిస్తున్నాడు:

"యావత్తు విశ్వ సార్వ భౌమత్వం కలిగి ఉన్న దేవుడు ఎంతో శుభదాయకుడు. ఆయన ప్రతి వస్తువుపై, ప్రతి విషయంపై సర్వాధికారం కలిగి ఉన్నాడు. మీలో ఎవరు మంచి పనులు చేస్తారో పరీక్షిండానికి ఆయన జీవన్మరణాలు సృష్టించాడు. ఆయన మహా శక్తిమంతుడు. గొప్ప క్షమాశీలి".

(అల్ ముల్క్: 1,2)

"భయం, ఆకలి, ధనప్రాణ, పంట నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పనిసరిగా పరీక్షిస్తాము". (బఖర: 155)

దైవ ప్రవక్త (స) ఇలా ఉపదేశించారు: **"అల్లాహ్ కొందరిని ఇచ్చి పరీక్షిస్తాడు. మరికొందరిని కష్టాలకు గురి చేసి పరీక్షిస్తాడు".**

ఈ బాధలు, కష్టాలన్నీ తాత్కాలిక తటాకమైన ఐహిక జీవితానికి సంబంధించినవే. కాని మన అనుభవంలోకి రాని బాధలు, సిసలైన పీడనలు ముందున్నాయి. అవి, మనిషి మరణానంతరం మొదలవుతాయి. అవేమంటారా?

అది– **'దైవదూతలు వచ్చి, వారి ముఖాలపై పిరుదలపై కొడుతూ 'ఇక దహనయాతన చవి చూడండి. ఇది మీరు చేజేతులా కొనితెచ్చుకున్న దాని పర్యవసానమే'.** (అన్‌ఫాల్: 50) అని అన్నప్పుడు కలిగే బాధ.

తను చలనం లేకుండా పడి ఉంటే – ఆప్తులు పెట్టే ఆర్తనాదాలు వింటూ కూడా కనీసం వారిని ఓదార్చలేని దుర్భర స్థితి ఏర్పడినప్పుడు కలిగే బాధ.

సమాధిలో చల్లనైన ఎసీలకు, మెత్తనైన పరుపులకు, వెచ్చనైన హీటర్లకు, పసందైన పరిసరాలకి బదులు ఇరుకిరుకు స్థలంలో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉన్నప్పుడు, చేసుకున్న పాప పుణ్యాలు తప్ప మరే సామగ్రి లేనప్పుడు, అరచి నోరు బాదుకున్నా వినే, పట్టించుకునే నాధుడే లేనప్పుడు కలిగే బాధ.

మున్‌కిర్ నకీర్‌లు వచ్చి **మన్ రబ్బుక?** – నీ ఆరాధ్య దేవుడు ఎవడు?, **మన్ నబియ్యుక?** – నీ ప్రవక్త ఎవరు?, **మా దీనుక?** –నీధర్మం ఏది? అని నిలదీసినప్పుడు, భూమి అత్యంత విశాలంగా ఉండి కూడా అతి ఇరుకైన ప్రదేశంలో ఉండాల్సి వచ్చినప్పుడు, ధరిత్రి చేసే ఒత్తిడికి కుడి ప్రక్కటి ఎముకలు ఎడమ ప్రక్కటి ఎముకల్లో చొచ్చుకుపోయినప్పుడు, 70 గజాల లోతుకి పాతుకుపోయేలా చేసే కొరడా దెబ్బ పడినప్పుడు కలిగే విపరీతమైన బాధ.

"అలాంటి వారిని (దైవాన్ని మరచిన వారిని) మేము ప్రళయ దినాన బోర్ల పడేసి ఈడ్చుకొస్తాము. వారిని, అంధులుగా, బధిరులుగా, మూగలుగా చేసి వేస్తాము". (బనీ ఇస్రాయీల్: 97) అని దేవుడు హెచ్చరించినప్పుడు కలుగుతుంది భరించరాని బాధ. కాకపోతే ఐహిక బాధలు పరీక్ష నిమిత్తం అయితే, మరణానంతరం బాధలు మనిషి చేసిన కర్మల ఫలం అయి ఉంటాయి. ఇది మరువ కూడదు. మరచి బ్రతకకూడదు. బ్రతికితే శిక్ష అనుభవించక తప్పదు.

"ఒక భయంకర దినాన తాము లేపి (దైవ సమక్షంలో) ప్రవేశించబడతామని వారికి తెలియదా? ఆ రోజు యావత్తు మానవులు విశ్వ ప్రభువు ముందు (తల వంచి) నిలబడతారు".

(దివ్య ఖుర్ఆన్ – 83; 4–6)

(వారు తమ దుష్కార్యాలకు జవాబు చెప్పుకోవాల్సిన పని లేదని భావిస్తున్నారా?) "ఎంత మాత్రం కాదు. దురాత్మల కర్మల వివరాలు కారాగారం (సిజ్జీన్) చిట్టాలో ఉంటాయి".(ముతఫ్ఫిఫీన్: 7)

telgo fbrvry.indd 4 3/11/12 11:52 AM

దీనికన్నా ఇంకా తీవ్రమైన బాధ మరొకటుంది. హష్ర్ మైదానంలో తలమీదికి సూర్యుడు తీసుకురాబడినప్పుడు, భూమి మరో భూమిగా మార్చివేయబడినప్పుడు, చేసుకు న్న వారికి చేసుకున్నంత అన్నట్టు – మోకాళ్ళ దాక కొందరు, నడుము దాక కొందరు, పూర్తిగా కొందరు చెమటలో మునిగి ఉన్నప్పుడు కలిగే బాధ.

నీడ ఎక్కడ కానరాని మాడ్చివేసే ఎండలో ఏ అండ మనకూ ఉండని తుది తీర్పు దినాన అల్లాహ్ అర్ష్ నీడకు సయితం నోచుకోని నికృష్ట స్థితి దాపురించినప్పుడు, హౌజె కౌసర్ (కౌసర్ సరోవరం) పై నుండి ధిక్కరించ బడినప్పుడు, మనం చేసిన పాపాలకు దేవుడు ఆగ్రహించి "మీ కర్మలకు పర్యవసానం చవి చూసుకోండి" అన్నప్పుడు, **"ఈ దినం రాకను మీరు బుద్ధి పూర్వకంగానే విస్మరించారు. ఇప్పుడు మేమూ కూడా మిమ్మల్ని విస్మరిస్తున్నాము"** (సజా:13) అని అన్నప్పుడు కలిగే బాధ మహా దారుణమైనది.

ఆలూబిడ్డలు, అన్నాదమ్ములు కూడా మా లెక్క పూర్తి కాలేదు సారీ అన్నప్పుడు, మన కర్మల చిట్టా ఎడమ చేతిలో ఇచ్చి – 'ఇదిగో చదువుకో నీ కర్మల చిట్టా. ఈరోజు నీ కర్మల లెక్క చూడటానికి నీవే చాలు" (దివ్యఖుర్ఆన్–17:14) అని అన్న ప్పుడు, విశ్వ కారుణ్యమూర్తి ముహమ్మద్ (స) వారి సిఫారసు కూడా మన విషయంలో స్వీకరించ బడనప్పుడు, 70 తల్లుల కన్నా అధిక ప్రేమ గల దేవుడు కూడా మన వైపు కన్నెత్తి చూడనప్పుడు, మనతో ఒక్క మాటైనా ప్రేమతో మాట్లాడనప్పుడు కలిగే తీవ్రమైన బాధ వర్ణనాతీతం.

మన నుదుటి మీద నరకవాసి అని వ్రాయబడినప్పుడు, అవిశ్వాసుల్ని గుంపులు గుంపులుగా నరకం వైపు తోలుకెళ్ళినప్పుడు, నరక ద్వారాలు తెరవబడినప్పుడు, **'నరకంలో పోయి పడండి. ఇక మీరిక్కడే ఎల్లకాలం పడి ఉంటారు'.** (జుమర్: 72) అని అన్నప్పుడు, అయ్యయ్యో! నా కర్మల పత్రం నాకసలు లభించకుండా, నా లెక్కేమిటో నాకు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది!! ఈ రోజు నా సిరి సమపదలు నాకేమాత్రం పనికి రాలేదే!? అయ్యో! నా అధికారం, అధిపత్యాలన్నీ మట్టిలో కలిసి పోయాయి" (హాఖ్ఖహ్: 26–29) అంటూ తీవ్ర పశ్చాత్తాపంతో నెత్తి నోరు బాదుకున్నప్పుడు, **'పట్టుకోండి వాణ్ణి. వాడి మెడకు గుదిబండ కట్టి నరకంలో త్రోసేయండి. ఆ తర్వాత 70 మూరల గొలుసుతో వాడ్ని బిగించి కట్టండి.....చీము, నెత్తురు తప్ప వాడికి తినడానికి మరేమీ లభించదు'** (దివ్యఖుర్ఆన్–69: 30–38) అని ఆజ్ఞ జారి చేయబడినప్పుడు, 'పట్టుకోండి వాడ్ని, బరబర ఈడుస్తూ తీసుకెళ్ళి నరకం మధ్యలో విసరి పడేయండి. సలసల కాగే నీటిని వాడి నెత్తి మీద కుమ్మరించండి...ఇక చూడు దీని రుచి, నువ్వు మహా గౌరవనీయుడవయిన పెద్ద మనిషివి కదూ!...' (దుఖాన్: 48, 49) అని అవహేళనగా అన్నప్పుడు కలిగే పీడన. జఖ్ఖూమ్ అనే చెట్టు తప్పకుండా తిన వలసి వచ్చినప్పుడు, చమురు తెట్టు లాంటి ఆ పదార్థం కడుపు లోకి పోయి మరగ కాచిన నీటిలా కుతకుత ఉడికిపోతున్నప్పుడు కలిగే బాధ మహా భయంకరమైనది.

చచ్చిపోదామన్నా చావు రానప్పుడు, చావుకే చావు ఇవ్వబడిన ప్పుడు, చర్మాలు కాలిపోతే మళ్ళీ మళ్ళీ కొత్త చర్మాల్ని సృజించ బడినప్పుడు, నరకంలో గల చివరి విశ్వాసి కూడా స్వర్గానికి చేరుకున్నప్పుడు, మీరు శాశ్వతంగా ఇక్కడే ఉండండి అని దేవుడు తీర్పు ఇచ్చేసినప్పుడి కలిగే పరమ పీడన వర్ణనాతీతం.

పై పేర్కొన్న ఈ బాధలు నేడు మన అనుభవంలో లేనివి, రానివి. అయితే హెచ్చరిస్తున్నది ఎవరో కాదు; తన దాసుల శ్రేయం కోరే కరుణ సాగరుడైన అల్లాహ్. ఆయన తెలియ పరచిన వాస్తవాలు నిజాలుగా మన ముందు ప్రత్యక్షమవ్వక ముందే **'పారా హుషార్'** అంటున్నాడు. **"మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి తప్పించుకోండి. (మీ ప్రభువుకు భయపడండి.) తండ్రి తన కొడుకుకు, కొడుకు తన తండ్రికి ఎలాంటి సహాయం చేయలేని దినం గురించి భయపడండి. దేవుని వాగ్దానం తప్పకుండా నెరవేరుతుంది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించ కూడదు సుమా!".** (లుఖ్మాన్: 33) ఇక ఐహిక సంపద, సుఖసౌఖ్యాలంటారా–,

"మానవులంతా ఒకే ఒరవడిలో కొట్టుకుపోతారన్న భయమే గనక లేకపోతే మేము కరుణామయుడైన దేవుణ్ని తిరస్కరించే వారి ఇండ్ల కప్పులను, వారు మేడపైకి ఎక్కే మెట్లను, వారి తలుపులను, వారు దిండ్లకానుకొని కూర్చునే పీఠాలను, అన్నింటినీ వెండి బంగారాలతో చేసి వేసే వారము. అయినా అది (మూన్నాళ్ళ ముచ్చటైన) ప్రాపంచిక జీవిత సంపద మాత్రమే. (పరలోక సంపద ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది. శాశ్వతమైనది). నీ ప్రభువు దగ్గర భయభక్తులు కలవారికే పరలోక సంపద ప్రాప్తమవుతుంది". (జుఖ్రుఫ్: 35)

కనుక విశ్వసించిన ప్రజలారా! మీరు మిమ్మల్ని, మీ భార్యా పిల్లల్ని నరకాగ్ని నుండి కాపాడుకోండి. ఆ నరకాగ్నికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు". (తహ్రీమ్: 6)

రేపటి భయంకర పీడనలు, పరాభవం నుంచి మనల్ని, మన వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా మన మీద ఉంది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: **"ప్రతీ ప్రాణి మృత్యు రుచి చూడవలసిందే. ప్రళయ దినాన మీరందరూ మీ కర్మల పూర్తి ఫలితాన్ని పొందుతారు. అప్పుడు ఎవడు నరకాగ్ని నుండి కాపాడబడి స్వర్గంలో ప్రవేశం కల్పించబడతాడో అతడు నిశ్చయంగా సఫలీకృతుడయ్యాడు. ప్రాపంచిక జీవితమైతే ఒక మాయా వస్తువు తప్ప మరేమీ కాదు".** (అలి ఇమ్రాన్: 185)

telgo fbrvry.indd 5 3/11/12 11:53 AM

హిందూ (వైదిక) ధర్మంలో దైవ భావన

ఆర్య ధర్మాలన్నింటిలో హిందూ మతం ప్రఖ్యాతి గాంచిన ధర్మం. **'హిందు'** అనేది వాస్తవంలో ఒక పారశీక పదం. సిందూ లోయ ఆవల ప్రదేశాల్లో నివసించే వారని దీని అర్థం. అయితే **'హిందూ మతం'** అనేది కొన్ని విశ్వాసాల సముదాయమని సాధారణంగా వాడబడే వ్యవహారిక పదం. దీనిలోని అత్యధిక బోధనలు, లేక విశ్వాసాలు వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత నుండి గ్రహింపబడ్డాయి.

హిందూ ధర్మంలో దైవం కొరకు వాడుకలోనున్న సామాన్య భావనలు:

సామాన్యంగా హిందూ ధర్మాన్ని, అనేక దేవుళ్ళ భావన కలిగిన ధర్మంగా పరిగణిస్తారు. వాస్తవంలో కూడా అనేకమంది హిందువులు దీన్ని అంగీకరిస్తారు. తాము అనేక దేవుళ్ళను విశ్వసిస్తామని కూడా చెప్పుకుంటారు. కొందరు హిందువులు ముగ్గురు దేవుళ్ళను (త్రిమూర్తులు) విశ్వసిస్తే, మరికొం దరు 33 కోట్ల దేవుళ్ళను విశ్వసిస్తారు. అయితే తమ ధార్మిక గ్రంథాల అధ్యయం చేసిన, చదువు సంధ్యలు గల హిందువులు మాత్రం, కేవలం ఒకే దేవుణ్ణి ఆరాధించాలని చెప్తుంటారు.

దైవభావనకు సంబంధించినంత వరకు హిందూ ముస్లింలలో గల మౌలిక భేదమేమంటే, హిందువులు సామాన్యంగా అద్వైతము (పెంథిజమ్) అంటే ప్రకృతే దైవం అని విశ్వసిస్తారు. అద్వైతము లేక ప్రకృతే దైవం అనే ఈ సిద్ధాంతం, ప్రతి వస్తువును, అది సజీవమైనది కానివ్వండి, నిర్జీవమైనది కానివ్వండి, పవిత్రమైనది అవతరింపబడి నది అని అంటుంది. అందుకనే హిందువులు చెట్లు, చంద్రుడు, సూర్యుడు, జంతువులను కూడా దైవ ప్రతి రూపంగా గుర్తిస్తారు. అంటే సామాన్య హిందువుల దృష్టిలో ప్రతి వస్తువు దైవమే.

దీనికి భిన్నంగా ఇస్లాం మానవునికి బోధించే దేమిటంటే, తాను స్వయంగా కాని తన చుట్టూ వ్యాపించివున్న వస్తువులను గాని దైవాంశ సంభూతులుగా దైవిక గుణాలు గలవిగా కాక, దైవ సృష్టితాలుగా గుర్తించమంటుంది. అందుకనే ఒక ముస్లిం ప్రతి వస్తువును దైవసృష్టిగా భావిస్తాడు. వేరే మాటల్లో చెప్పాలంటే ప్రతి వస్తువు దైవంతో సంబంధం కలిగి ఉందని విశ్వసిస్తాడు. చెట్లు, చంద్రుడు, సూర్యుడు ఇంకా ఈ విశ్వంలోని సమస్తమూ దైవ సృష్టితాలే.

క్లుప్తంగా చెప్పాలంటే హిందువుల వద్ద ప్రకృతిలోని ప్రతి వస్తువూ దైవమే. దీనికి భిన్నంగా ముస్లింలు ప్రతి వస్తువు, ప్రతి ఉనికి దైవానికి సంబంధించినదిగా భావిస్తారు. దివ్య ఖురాన్‌లో ఇలా చెప్పటం జరిగింది:

"అయితే అన్నిటికన్నా ప్రాథమిక సంయుక్త విషయం ఏమిటంటే మేము కేవలం ఒకే దైవాన్ని తప్ప, ఇంకెవరి ఆరాధన చేయము."

ఇక ఇప్పుడు ఇస్లాం మరియు హిందూ ధార్మిక గ్రంథాల బోధనలను తులనాత్మకంగా విశ్లేషించి, సంయుక్త విషయాలను పరిశీలిద్దాం.

భగవద్గీత:

హిందూ ధర్మంలోని గ్రంథాలన్నిటిలో 'భగవద్గీత' ప్రామాణిక గ్రంథం అంటారు. ఈ గ్రంథంలోని శ్లోకాన్ని చూడండి:

"ఎవరి జ్ఞానాన్నైతే భౌతిక కోరికలు హరించి వేశాయో, అలాంటివారు దేవతల ముందు మోకరిల్లారు, అంతేకాక తమ ఇష్టా నుసారం వారు పూజాపద్ధతులను రూపొందించుకున్నారు" (భగవద్గీత, అధ్యాయం: 7, శ్లోకము:20)

భౌతిక కోరికలు లేక ప్రపంచ లాలసత్వంలో మునిగిపోయిన వారు నిజమైన దేవుణ్ణి విడిచి, మిథ్యా దేవతల ఆరాధన మొదలు పెడతారని ఇక్కడ గీత పేర్కొంటున్నది.

ఉపనిషత్తులు:

ఉపనిషత్తులు కూడా హిందువుల ధార్మిక గ్రంథాలుగా పరిగణింపబడతాయి. ఉపనిషత్తులోని ఈ శ్లోకాన్ని చదవండి.

1) "ఆయన కేవలం ఒక్కడే, వేరెవ్వరూ లేకుండా." (చంద్రోగ్య ఉపనిషత్తు: 6-2-1)

ఉపనిషత్తులోనే ఇంకో వాక్యాన్ని చూడండి.

2) 'ఆయనకు తల్లిదండ్రులూ లేరు, వేరెవ్వరూ దేవుడూ లేడు.' (శ్వేతాశ్వతర ఉపనిషత్తు: 6,9) (రెండవ భాగము - పేజి 263)

ఉపనిషత్తులోనే ఇంకో శ్లోకాన్ని చూడండి.

3) "ఆయన లాంటివారు వేరెవ్వరూ లేరు." (శ్వేతాశ్వతర ఉపనిషత్తు-అధ్యాయం4, శ్లో -19)

"ఆయన లాంటివారు ఎవరూ లేరు, ఆయన పేరు మహోన్నతమైనది".

పైన పేర్కొన్న శ్లోకాలను, ఈ క్రింది ఖుర్‌ఆన్ ఆయత్‌లతో పోల్చి చూడండి.

"ఆయనకు సరిసమానమైన వారెవరూ లేరు." (ఇఖ్లాస్ : 4)

"యావత్తు విశ్వవ్యవస్థలో ఆయన్ని పోలిన వస్తువు లేదు. ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు." (షూర : 11)

4) దైవాన్ని భౌతిక రూపంలో మానవుడు ఊహించటానికైనా అశక్తుడే అనే విషయం, ఉపనిషత్తులోని ఈ క్రింది శ్లోకాల ద్వారా విదితమవుతోంది.

"ఆయన ఆకారం కనిపించదు, కళ్లతో ఎవరూ కూడా ఆయన్ని చూడలేదు."

(శ్వేతాశ్వతర ఉపనిషత్తు - 4-20)

దివ్య ఖుర్‌ఆన్ ఈ విషయాన్ని ఇలా వర్ణిస్తున్నది:

"ఎవరి చూపులూ ఆయన్ని అందుకోలేవు. ఆయన మాత్రం అందరి చూపుల్నీ అందుకోగలడు. ఆయన ఎంతో సునిశిత దృష్టికలవాడు. ప్రతిదాన్నీ తెలుసుకోగలవాడు."

(అన్ ఆమ్ : 103)

వేదాలు:

హిందూ ధార్మిక గ్రంథాల్లో వేదాలు ప్రముఖ గ్రంథాలుగా పరిగణింపబడతాయి.

1) ఋగ్వేదము. (2) యజుర్వేదము. (3) సామ వేదము. (4) అధర్వణవేదము.

1) యజుర్వేదములో ఒక వాక్యం ఇలా ఉంది "ఆయనకు ఎలాంటి ప్రతిరూపం లేదు."

(యజుర్వేదము:32-3)

మరొక చోట ఇలా చెప్పబడింది: "ఆయన ఎవరికీ జన్మించలేదు. ఆయనే మా ఆరాధనకు అర్హుడు, ఆయనకు ఎలాంటి ప్రతి రూపం

telgo fbrvry.indd 6 3/11/12 11:53 AM

లేదు. నిస్సందేహంగా ఆయన గౌరవం మహోన్నతమైనది. ఆయన తనను సూర్యుడు మొదలగు వాటిలో పరివేష్టించుకోగలడు. బహుశ ఆయన నాకు హాని కలిగించక పోవచ్చు. ఇదే నా ప్రార్థన. ఆయన ఎవరికీ జన్మించలేదు,ఆయన మా ఆరాధనకు అర్హుడు.

(యజుర్వేదము, దేవిచంద్, ఎం.ఎ. – ఫిలాసఫీ – పేజి – 377)

2) 'ఆయన నిరాకారుడు (భౌతిక శరీరం లేనివాడు) నిర్మలమైనవాడు." (ఇది యజుర్వేదంలో ఉంది 40 – 8)

'ఆయన ప్రకాశించేవాడు, భౌతిక శరీర రహితుడు (నిరాకారుడు) గాయం (మచ్చ) లేనివాడు, అతుకు లేనివాడు, నిర్మలమైనవాడు, ఆయనలో చెడు ప్రవేశించ జాలదు. ఆయన విశాల దృష్టి గలవాడు, వివేకవంతుడు, పరివేష్టించి ఉండువాడు. తనంతట తానుగా ఉనికి కలిగినవాడు, ఆయన అనంత కాలానికి యజమాని." **(యజుర్వేద సమిత బై: రాల్ప్ ఐ.హెచ్. గ్రిఫ్ఫిత్, పేజీ : 538)**

3) యజుర్వేదములోనే ఇంకా ఇలా ఉంది:

"ఎవరైతే ప్రకృతి శక్తుల్ని– అసంభూతిని పూజిస్తారో, వారు అంధకారంలో ప్రవేశిస్తారు." ఉదాహరణకు వాయువు, అగ్ని, నీరు మున్నగునవి. ఎవరైతే 'సంభూతి'ని పూజిస్తారో, వారు మరీ గాఢాంధకారాల్లో మునిగి పోతారు. సంభూతి అనగా (మానవుల చేత) సృజించబడినవి. ఉదా: కుర్చీ, బల్ల, విగ్రహం మొదలైనవి. (యజుర్వేదము:40–9)

4) ఇంకొక ప్రార్థనలో ఇలా వచ్చింది: 'మాకు ఋజుమార్గం చూపించు, మమ్మల్ని మార్గ భ్రష్టులు, మార్గవిహీనులు చేసే పాపాలకు దూరం చెయ్యి." (యజుర్వేదము: 40–16)

అధర్వణ వేదములోని ఈ శ్లోకాలను పరిశీలించండి: 1) "నిస్సందేహంగా దేవుడు మహోన్నతుడు." **(అధర్వణవేదము:20–58–3)**

"ఆయన గోప్యంగా ఉన్నటువంటి, బహిరంగంగా ఉన్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసినవాడు. ఆయన గొప్పవాడు. సర్వకాల సర్వావస్థలలో ఆధిక్యం కలిగి ఉండే వాడు."

(అర్రాద్:9)

ఋగ్వేదము:

1) అన్ని వేదాల్లో ఋగ్వేదము ప్రాచీనమైనది. హిందువుల పవిత్రమైన ధార్మిక గ్రంథాల్లో ఇదొకటి. ఋగ్వేదములో ఇలా వచ్చింది:

"ధార్మిక ప్రజలు దేవుణ్ణి అనేక పెర్లతో పిలుస్తారు." (ఋగ్వేదము:1–164–46)

2) ఋగ్వేదములో మహోన్నతుడైన దేవుణ్ణి వర్ణిస్తూ వచ్చిన గుణగణాలు, 33కు తక్కువేమి కాదు. వాటిలో అనేకం ఋగ్వేదములోని రెండవ పుస్తకము, ప్రార్థనల మొదటి భాగంలో లభిస్తాయి. ఋగ్వేదములో దేవుని అనేక గుణాలను, పేర్కొనటం జరిగింది. అన్నింటి లోకెల్ల దేవుని అందమైన గుణము ఋగ్వేదములోని రెండవ శబ్దము, మూడవ శ్లోకములో ఉంది. ఇక్కడ దేవుని కోసం 'బ్రహ్మ' అనే పదం ఉపయోగించబడింది. **'బ్రహ్మ'** అనే పదాన్ని (అంటే దాని అర్థాన్ని) అరబ్బీలోకి అనువదిస్తే **'ఖాలిఖ్'** అని వస్తుంది. అంటే సృష్టికర్త, సృష్టించేవాడు – **'బ్రహ్మ'** అనే పదం వాడితే, అభ్యంతరం లేదు. అయితే మహోన్నతుడైన దేవునికి నాలుగు శిరస్సులతో కూడిన భావనను (దైవం క్షమించుగాక!) ముస్లింలు తీవ్రంగా నిరసించి తిరస్కరిస్తారు.

దేవుణ్ణి ఒక ఆకారంలో లేక శారీరక రూపం (అంథ్రోపోమోర్ఫిక్)లో లేక భౌతిక రూపంలో ప్రదర్శించే చర్యను యజుర్వేదములోని ఈ శ్లోకాల ద్వారా ఖండించటం జరిగింది. **'న తస్య ప్రతిమా అస్తి'** – ఆయనకు ఎలాంటి రూపం లేదు.(యజుర్వేదము:32–3)

ఋగ్వేదములోని రెండవ పుస్తకము, ప్రార్థనల మొదటి భాగంలోని మూడవ శ్లోకములో దేవునికి సంబంధించిన శ్రేష్ఠమైన గుణమొకటి పేర్కొనబడింది. అందులో దేవుణ్ణి **'విష్ణు'** అనటం జరిగింది. **'విష్ణు'**కు అర్థం పోషించేవాడు అని వస్తుంది. దీన్నే కనుక అరబ్బీ భాషలో అనువదిస్తే అది **'రబ్'**గా మారుతుంది. మహోన్నతుడైన దేవుణ్ణి **'రబ్'** పోషించేవాడు, లేక విష్ణు అని పిలిస్తే అభ్యంతరం లేదు. కాని విష్ణువకు సంబంధించి హిందూ సోదరులలో గల భావన అనగా నాలుగు చేతులు కలిగి, ఒక చేతిలో చక్రం, రెండవ చేతిలో శంఖం, మూడవ చేతిలో బాణం, నాలుగవ చేతిలో గద కనిపించే **'విష్ణువు'**ను దేవునిగా అంగీకరించటం ముస్లింలకు ఏ విధంగానూ సమ్మతం కాదు. దేవునికి సంబంధించిన ఎలాంటి చిత్రం గాని, బొమ్మగాని, రూపం గాని కలిగిన భావన ముస్లింలకు సమ్మతం, అమోద యోగ్యం కానేకాదు. ఇంతకు ముందు మేము పేర్కొన్నట్లు యజుర్వేదములోని 40వ అధ్యాయంలోని పందొమ్మిదవ శ్లోకానికి కూడా ఈ భావన విరుద్ధంగానే ఉంది.

3) ఋగ్వేదములోని ఈ క్రింది శ్లోకాలను పరిశీలించండి: "మిత్రులారా! అతన్ని తప్ప వేరెవరినీ ఆరాధించకండి, కేవలం ఆయన ఒక్కడే దేవుడు." (ఋగ్వేదము:8–1–1)

4) 'వివేకవంతులైన జోగులు తమ హృదయ మస్తిష్కాలను మహోన్నతమైన యదార్థం (సత్యం) వైపునకే మళ్ళించుకుంటారు. సర్వ శక్తిమంతుడు, మహోన్నతుడు, సర్వాధికారి ఆయనే. ఆయన ఒక్కడే, వారి (మానవుల) కర్మలను మరియు జ్ఞానేంద్రియాలకు కేటాయింపబడిన విషయాలను సైతం గుర్తెరిగిన వాడు. నిస్సందేహంగా ఆయనే మహోన్నతుడు, మరియు ఆకాశ సృష్టికర్త.

(రిగ్వేద సమితి, వ్యా:6. పేజి:1802 అండ్ 1803 బై: స్వామి సత్యప్రకాశ్ సరస్వతి అండ్ సత్యకం విద్యలంకర్)

వేదాంత బ్రహ్మ సూత్రము:

వేదాంతంలోని బ్రహ్మసూత్రంలో ఇలా ఉంది: **'ఏకం బ్రహ్మం, ద్వితీయం నాస్తే, నేహ్నా నాస్తే కించన్.'**

దేవుడు కేవలం ఒక్కడే. రెండవ వాడు వేరెవ్వడూ లేడు, లేడూ, లేడూ, కొంచెం కూడా లేడు.

(ప్రపంచ ధర్మాల్లో దైవభావన' అనే పుస్తకం నుండి)

telgo fbrvry.indd 7 3/11/12 11:53 AM

మానవ మహోపకారి ముహమ్మద్ (స)

ఆత్మాభిమానం: కందక యుద్ధ సమయంలో దైవప్రవక్త (స) కూడా కందకాన్ని త్రవ్వే పనిలో అనుచరులతో పాటు పాల్గొన్నారు. కాని అనేకమంది ఆకలితో నకనకలాడుతున్నారు. కళ్లు లోపలకు పీక్కుపోయాయి. ఒక అనుచరుడు ఆకలితో బాధ పడుతూ దైవప్రవక్త(స) దగ్గరకు వచ్చాడు.

"దైవ ప్రవక్తా! మూడు రోజుల నుంచి తిండి లేదు. ఆకలికి తాళలేక ఇదిగో పొట్ట మీద రాయి కట్టుకున్నాను" అంటూ అతను చొక్కా పైకెత్తి కడుపుమీద కట్టుకున్న రాయి చూపించాడు.

దైవప్రవక్త(స) అనుచరుని పరిస్థితి చూసి ఎంతో జాలిపడ్డారు. అనుచరుని మాటలకు సమాధానంగా ఆయన తన చొక్కా పైకెత్తి చూపారు. అది చూచిన తరువాత అనుచరుని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. తన ప్రియతమ నాయకుని పొట్టపై రెండు రాళ్ళు కట్టబడి ఉన్నాయి.

ముహమ్మద్(స) వారు జీవితంలో ఏ నాడూ తన కోసం గాని, తమ కుటుంబం గురించిగాని దానాన్ని స్వీకరించలేదు. ప్రవక్త (స) వారి మనుమడు, దానంగా వచ్చిన ఖర్జూరాలలో నుండి ఓ ఖర్జూరాన్ని తీసుకుని నోటిలో పెట్టుకోగా, ఆయన నోటి నుండి ప్రవక్త(స) ఖర్జూరాన్ని తీసేసి, ముహమ్మద్ (స) వారి సంతానం దానం తినకూడదని తెలియదా? అని మనుమడిని మందలించారు.

సహనం మరియు క్షమాగుణం:

ఒకసారి దైవ ప్రవక్త(స)వారు తన దత్త పుత్రుడైన జైద్ బిన్ హారిస (ర)ని వెంట బెట్టుకుని మక్కాకు అరవై మైళ్ళ దూరంలో ఉన్న తాయిఫ్ పట్టణానికి ప్రయాణమయ్యారు. ఆ పట్టణానికి సంబంధించిన ముగ్గురు పెద్దలు కూడా ముహమ్మద్ (స) వారు అందజేసిన **'ఆరాధ్యుడు ఒక్కడే'** నన్న దైవ సందేశాన్ని తిరస్కరించడమే కాకుండా అహంకారంతో దుర్భాషలాడి ఆయన్ని తీవ్రంగా బాధ పెట్టారు. అంతే కాదు వారు తమ బానిసలను, తుంటరి పిల్లలను దైవ ప్రవక్త (స) పైకి ఉసిగొల్పారు. వాళ్ళు రాళ్ళు రువ్వుతూ 3 మైళ్ళ వరకూ వెంబడించారు. దైవప్రవక్త (స) దేహం రక్తసిక్తమైపోయింది. ఆ రక్తం చెప్పుల్లోకి పోయి గడ్డకట్టి కాళ్ళు చెప్పులకు అంటుకు పోయాయి. పట్నం వెలుపల ఓ పండ్ల తోట నీడలో కూర్చుని, బాధతో ఆకాశం వైపు చూస్తూ అల్లాహ్‌ను ప్రార్థించారు. అల్లాహ్ ఆయన మొరను ఆలకించాడు. తాయిఫ్ పట్టణానికి ఇరు వైపులా రెండు కొండలున్నాయి. ఆ కొండల పర్యవేక్షకుడైన దైవదూతను తీసుకుని జిబ్రయీల్ (అ) వచ్చారు. ఆ దూత ఇలా విన్నవించుకున్నాడు.

"ముహమ్మద్ (స)! విశ్వ ప్రభువు మీ ప్రార్థన ఆలకించాడు. మీ కోసమే ఆయన నన్ను పంపాడు. మీరు ఆజ్ఞాపిస్తే తాయిఫ్ పట్టణానికి ఇరువైపుల ఉన్న రెండు కొండలను కలిపేసి పట్టణాన్ని నుగ్గునుగ్గు చేస్తాను. పట్నం వాసులు తృటిలో సర్వనాశనమవుతారు."

కాని విశ్వ కారుణ్యమూర్తిగా ప్రభవించిన దైవప్రవక్త (స) దానికి అంగీకరించలేదు. "వద్దు వద్దు. ఆ పని చేయకండి. ఈనాడు వీళ్ళు ఇస్లాం స్వీకరించకపోతే, రేపు వీరి సంతానమయినా స్వీకరించవచ్చని నాకు ఆశ ఉంది. వారి భావి సంతతి ముస్లిములై పోవచ్చు. అంచేత వీళ్ళను అంతమొందించడం నాకిష్టం లేదు" అన్నారు ఆయన.

స్పృహ తప్పేలా కొట్టిన వారిని, రక్తం చెప్పుల్లో గడ్డ కట్టే విధంగా, ఘోరంగా రాళ్ళతో కొట్టినా సరే, వారిని శిక్షించవద్దని వారిలో కొందరైనా ధర్మాన్ని స్వీకరిస్తారే మోనన్న ఆశాభావాన్నే వ్యక్తం చేసిన కారుణ్యమూర్తి మరియు సహనశీలి– ముహమ్మద్ (స) .

ఒకరోజు అబూలహబ్ ఇంటికి వస్తూ దారి పక్క పడివున్న మేక ప్రేగులు తీసుకుని వచ్చాడు, వాటిని అతని భార్యయైన ఉమ్మె జమీల్‌కిచ్చాడు. దైవప్రవక్త (స) తమ ఇంటి ముంగిట సలాత్ (నమాజ్) చేస్తున్నారు. ఆయన సజ్దాలోకి పోగానే ఉమ్మె జమీల్ ఆ మేక ప్రేగుల్ని ఆయన మీదికి విసిరి పడేసింది. దాంతో ఆ ప్రేగుల్లోని మలినమంతా దైవప్రవక్త (స) శిరస్సు, బట్టలపై పడింది.

దైవప్రవక్త (స) సజ్దా నుండి తల పైకెత్తి చూశారు. ఉమ్మె జమీల్, ఆమే భర్త అబూలహబ్ విరగబడి నవ్వుతూ నిలుచున్నారు. అంతలో ప్రవక్త (స) వారి భార్య హజ్రత్ ఖదీజా (ర) లోపలి నుండి వచ్చి దైవప్రవక్త (స) పై పడిన ప్రేగులు, మలినం చూసి ఎంతో బాధ పడ్డారు. వెంటనే వాటిని తుడిచి నీళ్ళతో కడిగారు.

సత్య తిరస్కారులు ఎన్నెన్ని అకృత్యాలకు పాల్పడినా దైవప్రవక్త (స) చూస్తూ సహించడం తప్ప పల్లెత్తుమాట కూడా అనేవారు కాదు. కాకపోతే మితిమీరిన దౌర్జన్యాలతో విసుగెత్తి "ముత్తలిబ్ వంశీయులారా! మీ పొరుగువారి పట్ల ప్రవర్తించ వలసిన తీరు ఇదేనా!" అని మాత్రం అనేవారు.

ఓ రోజు దైవ ప్రవక్త (స) ఇంటికి తిరిగొస్తుంటే దారిలో ఓ దుర్మార్గుడు ఆయన మీద మన్ను విసిరాడు. దైవప్రవక్త (స) అదే స్థితిలో ఇంటికి వచ్చారు. ఆయన గారాల కూతురు చిన్నారి ఫాతిమా (ర) తండ్రి తలమీద మన్ను,ధూళి చూసి పరుగెత్తుకెళ్ళి నీళ్ళు తెచ్చి కడుగుతూ కారణమడిగారు. కారణం తెలుసుకున్న ఫాతిమా (ర) కంట తడిపెట్టారు. పొర్లుకొస్తున్న దుఖాన్ని ఆపుకోలేక తండ్రిని కావలించుకుని భోరున విలపించారు. **"ఫాతిమా! ఏడ్వకమ్మా, అల్లాహ్ నీ తండ్రికి తప్పకుండా సహాయం చేస్తాడు"** అన్నారు దైవ ప్రవక్త (స) కూతుర్ని సముదాయిస్తూ.

ముహమ్మద్ (స) వారు వెళుతున్నప్పుడు ఓ స్త్రీ ఆయనపై కసవు (ఇంటిలో ఊడ్చిన

telgo fbrvry.indd 8 3/11/12 11:54 AM

చెత్తను) పోసేది. అయితే ఓ రోజు ఆ స్త్రీ ఇంటిమీదుగా వెళుతున్నప్పుడు తనపై కసవు పడకపోవటం గమనించి, ముహమ్మద్ (స) వారు ఆమె గురించి వాకబు చేశారు. ఆమె అనారోగ్యంతో మంచం పైనే ఉందని తెలిసి, ఆమెను పరామర్శించారు. ప్రతీసారి కసవు పోసే ఓ స్త్రీ పట్ల ముహమ్మద్ (స) యొక్క ప్రవర్తన ఆమెపై గొప్ప ప్రభావాన్ని చూపింది. తన బంధువులు కూడా పరా మర్శించడానికి రానప్పుడు, తను ప్రతీ సారి అవమానించే ఓ వ్యక్తి తన బాగోగులు కనుగొని, తన కోసం అల్లాహ్‌కు దువా చేయడం చూశాక, ఆ ఉత్తముడు ఆచరిస్తున్న మానవీయ ధర్మం ఎంతో గొప్పది, మరియు ఆయనే దైవ ప్రవక్త (స) అని ఆమె 'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదు ర్రసూలుల్లాహ్' అంటూ ఇస్లాం స్వీకరించింది.

తన పరమ శత్రువుల్ని సయితం మన్నించి వేశారాయన. తన ప్రియమయిన బాబాయి హమ్‌జా (ర)ను చంపి ఆయన కళేబరాన్ని ఖండాలుగా ఖండించి, దానిని చీల్చి కాలేయంలోని ఓ ముక్కను తీసి నమిలిన మహిళను కూడా ముహమ్మద్ (స) క్షమించారు. సహనం, క్షమా గుణాలు కలిగిన కారుణ్యమే ముహమ్మద్ (స).

నిజాయితీ:

ముహమ్మద్ (స) వారిని శత్రువులు హత్య చేయాలని పథకం వేశారు. ఆ పథకం ప్రకారం ఇంటి బయట కాపుకాచి, ప్రవక్త (స) బయటకి రాగానే మూకుమ్మడిగా మీదపడి ఆయన్ని హతమార్చడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంటిలో ఆయనతో పాటు వారి పినతండ్రి కుమారుడైన అలీ (ర) కూడా ఉన్నారు.

అలీ (ర)కు విషయాన్ని అంతా చెప్పి, తను వెళ్ళిన తర్వాత మదీనా వచ్చెయ్యమని చెప్పి తెల్లవారగానే ఇంట్లో భద్రపరచబడిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకిచ్చెయ్యమని ప్రవక్త (స) చెప్పారు.

ఏమిటా వస్తువులు?! ఇతర ప్రజలతో పాటు బద్ధ విరోధులు సైతం తన దగ్గర దాచుకున్న ధన కనక వస్తువులు. ముహమ్మద్ (స)ను దైవప్రవక్తగా అంగీకరించకపోయినా సరే, ఆయనను విశ్వసనీయుడని, నిజాయితీపరుడని, సత్యసంధుడని శత్రువులు కూడా నమ్మారు.

అందువల్ల వారు తమ విలువైన వస్తువుల్ని దైవప్రవక్త (స) దగ్గర భద్రపరచుకుని వాటికి పూర్తి సంరక్షణ కలిగిందని ధైర్యంగా ఉండేవారు. ఇలా దాచబడిన వస్తువులు అనేకం ఉండటం వలన అలీ (ర)ని తన వెంట తీసుకుని పోకుండా ఎవరి వస్తువులు వారికి అప్పగించే వరకూ మక్కాలోనే ఉండమని ప్రవక్త (స) చెబుతున్నారు.

దేశాన్ని విడిచి పరాయిచోటుకు వెళ్ళిపోవలిసిన దుస్థితిని తనకి కల్పించిన శత్రువుల వస్తువులను సైతం ఎవరివి వారికి చేరాలని కోరుకున్న నిజాయితీపరులు ముహమ్మద్ (స). శత్రువుల సైతం ఆయన నిజాయితీని ప్రశంసించకుండా ఉండలేక పోయారు. శత్రువులు సయితం ఏనాడూ ముహమ్మద్ (స) వారి నిజాయితీని శంకించలేదు. ఇది చారిత్రక సత్యం.

నిరాడంబరుడు మరియు పరోపకారి:

మక్కా విజయం తరువాత దాదాపు 10 లక్షల చదరపు మైళ్ళ వైశాల్యంగల భూభాగం ఆయన వశమైంది. ఆ అరేబియా అధినేత తన సొంత చెప్పుల్ని తానే బాగు చేసుకున్నారు. తన బట్టల్ని తానే కుట్టుకున్నారు. మేకల పాలు పిండారు. తన పొయ్యి తానే శుభ్రం చేసుకుని రాజేసుకున్నారు. ఇంకా ఇతర అల్పమయిన ఇంటి పనులెన్నో చేశారు. ఆయన జీవిత కాలంలోనే చివరన ఆయన నివసించిన మదీనా మహా నగరమంతా ఐశ్వర్యంతో తులతూగుతూ ఉండింది. ఎక్కడ చూచినా వెండి బంగారాలు సమృద్ధిగా కానవచ్చేవి. సౌభాగ్యవంతమైన ఆ కాలంలోనూ ఆయన ఇంట పొయ్యి అనేక వారాలు చల్లగానే పడి ఉండేది. ఆయన ఖర్జూరపు పండ్లు తిని, నీళ్ళు త్రాగి కాలం వెళ్ళదీసేవారు. ఆయన కుటుంబంలో అనేక రాత్రులు ఎడతెగకుండా పస్తులతో పడుకునేవారు. ఆయన పగలంతా పరిశ్రమించి పడుకునేది మెత్తటి పరుపుపై కాదు, ఖర్జూరపు చాపపై.

దైవ దౌత్యానికి పూర్వం ముహమ్మద్ (స) ఉకాజ్ ప్రాంతంలో వ్యాపారం చేసేవారు. అయితే ఆయన చేసే వ్యాపారం చాలా నిజాయితీగా ఉండేది. సరుకు నాణ్యతను బట్టి ధరను నిర్ణయించి, మోసం చేయకుండా వ్యాపారం చేసేవారు. నాణ్యత తక్కువున్న నాసిరకం సరుకులను కొనేవారికి తెలియకపోయినా సరే, వాటి నాణ్యత ఏ విధంగా తక్కువైందో వివరించి, తక్కువ ధరకు విక్రయించేవారు. ఆయన నిజాయితీ అక్కడ వారికి ఓ వింతే అయింది. ఎంత అమ్మకాలు జరిగినా ఈ వ్యాపారి ధనవంతుడు కాలేకపోవడానికి గల కారణాన్ని తెలుసుకోవాలని ఓ బడా వర్తకుడైన **'ఉత్బా'** ఓ రోజు ఈయనను అనుసరించాడు. ముహమ్మద్ (స) వారు తన సంపాదనను పేదవారికి, వృద్ధులకు, అనాధలకు పంచిపెట్టడాన్ని ఉత్బా గమనించారు.

ఈ మహనీయుడు పరోపకారానికే ప్రాధాన్యతనిచ్చేవారు. తన పొరుగువాడు పస్తులుండగా, కడుపునిండా తినేవాడు ముస్లిం కాదని చెప్పడమే కాకుండా, ఆ పొరుగువాడు తన చుట్టూ ఉన్న 40 ఇళ్ళలో ఎవరైనా కావచ్చని బోధించిన మానవ మహోపకారి ముహమ్మద్ (స).

స్త్రీలను గౌరవించడం:

ముహమ్మద్ (స) వారు తన యవ్వనంలో సిరియా దేశానికి వ్యాపారం నిమిత్తం వెళ్ళేవారు. సిరియా దేశపు ఆడవాళ్ళు అత్యంత సౌందర్యంగా ఉండేవారు. కాని ముహమ్మద్ (స) వారు ఆ స్త్రీలను కన్నెత్తి కూడా చూసేవారు కాదు.

అజ్ఞాన కాలంలో అరబ్బులు **'కాబా'** చుట్టూ నగ్నంగా ప్రదక్షిణలు చేసేవారు. స్త్రీలు కూడా నగ్నంగా ప్రదక్షిణలు చేసేవారు. కాని '23సం'ల స్వల్ప కాలంలోనే, ఏ కాబా చుట్టూ అయితే స్త్రీలు నగ్నంగా ప్రదక్షిణలు చేశారో, అదే కాబా చుట్టూ స్త్రీలు తమ శరీరాన్ని పూర్తిగా కప్పుకొని ప్రదక్షిణ చేసేలా చేశారు. 1400 సంవత్సరాల క్రితమే స్త్రీకి సరియైన సభ్యతను ఆ మహనీయుడే నేర్పారు. స్త్రీని నాగరిక స్త్రీగా మార్చిన మహనీయుడు– ముహమ్మద్ (స). **(శాంతి బాట సౌజన్యంతో)**

telgo fbrvry.indd 9 3/11/12 11:54 AM

భారత స్వాతంత్ర్యోద్యమం ముస్లింలు

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక మహోజ్వల ఘట్టం. భారతీయుల పోరాట పటిమకు, త్యాగనిరతికి, దేశాభిమానానికి ఆ ఉద్యమం ఒక నిలువుటద్దం. ఈ పోరాటానికి భారత దేశపు (ప్రస్తుత) అతి పెద్ద అల్ప సంఖ్యాక వర్గమైన ముస్లిం సమాజం తనదైన భాగస్వామ్యాన్ని అందించింది. ముస్లిమేతర సాంఘిక జన సమూహాలతో మమేకమై స్వాతంత్ర్య సమరంలో తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించింది. అపూర్వ త్యాగాలతో, అసమాన ఆత్మార్పణలతో భారతీయ ముస్లింలు పునీతులయ్యారు. బ్రిటీష్ పాలకుల 'విభజించు-పాలించు' అన్న కుటిల నీతి భారతీయులను హిందువులు గా-ముస్లిములుగా విభజించడంలో సఫలమయ్యింది. దానికి తోడు ప్రజల మత భావాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలను సాధించదలచిన మతోన్మాద శక్తులు, వ్యక్తులు ఈ చీలికకు అగాధంగా మార్చాయి. పర్యవసానంగా బ్రిటీషర్ల బానిసత్వం నుండి మాతృభూమికి విముక్తి చేసేందుకు సాగిన సుదీర్ఘ పోరాటాల చరిత్రలో ముస్లిం సమాజం త్యాగాలు మరుగున పడిపోయాయి. అలా సామాన్య ప్రజలకు చేరువ కాని ముస్లింల త్యాగమయ చరిత్రను ప్రజల చెంతకు చేర్చేందుకు సాగుతున్న కృషిలో చిన్న ప్రయత్నమిది. - సయ్యద్ నసీర్ అహ్మద్

సిరాజుద్దౌలా

16 వ శతాబ్దంలో వర్తకం పేరుతో భారత గడ్డ మీద అడుగు పెట్టిన బ్రిటిషు వర్తకులు స్వదేశీ పాలకుల దరి చేరి ధనకనక వస్తు వాహనాలను కానుకలుగా సమర్పించి, ప్రలోభ పెట్టి ఈ నేల మీద స్థిర పడటం ప్రారంభించారు. ఈ వర్తకుల రాకతో వ్యాపారం అభివృద్ధి చెందుతుందని ఆశించిన స్వదేశీ పాలకుల ఎదుట సాగిలపడి అనుమతి సంపాదించుకున్నారు. ఆ అనుమతుల ఆధారంగా గిడ్డంగుల రక్షణ కోసమంటూ పటిష్టమైన కోటల నిర్మాణానికి పూనుకున్నారు. 'మీరు వ్యాపారులు. మీకు కోటల అవసరం ఏముంది? నా రక్షణలో ఉన్నందున మీకు శత్రువు గురించి ఎటువంటి భయం అక్కర లేదు' అని బెంగాలి నవాబు అలీ వర్ది ఖాన్ స్వదేశీ పాలకులు హామీలు ఇచ్చినా, ఓ పథకం ప్రకారం గిడ్డంగుల నిర్మాణంతో ప్రారంభమై, పటిష్టమైన కోటలు కట్టుకుంటూ, రాజ్యాధికారం కోసం ఆంగ్లేయులు స్వదేశీ పాలకుల విషయంలో జోక్యం చేసుకోవడం ఆరంభించారు. ఆ ప్రయత్నంలో భాగంగా బెంగాలు మీద ఆధిపత్యం కోసం ఆరంభించిన ఎత్తుగడలను ఆదిలోనే గ్రహించి, ఆ కుయుక్తులను వమ్ము చేసి, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకుల పెత్తనాన్ని రూపుమాపేందుకు పాతికేళ్లు దాటని యువకుడు బెంగాలు నవాబు సిరాజుద్దౌలా **'భారత స్వాతంత్ర్య సాయుధ సమరేతిహాసంలో అరుణ పుటల్ని తెరిచాడు'. భరత గడ్డ మీద తొలిసారిగా 'బ్రిటీషు దుష్టులను కత్తి పట్టి ఎదిరించిన మొనగాడు'గా ఖ్యాతి గాంచిన ఆయన ప్రఖ్యాత ప్లాసీ యుద్ధంలో క్లయివు నాయకత్వం లోని కంపెనీ సైన్యాలను ఎదుర్కొన్నాడు.**

వహాబీ - ఫరైజీల తిరుగుబాటు

తొలి తిరుగుబాటు జెండా ఎగుర వేసిన ఫకీర్లు-సన్యాసుల ఉద్యమం సమాప్తమైన రెండు దశాబ్దాల కాలంలోనే ముస్లింలు బ్రిటిష్ పాలకులను ఎదిరించేందుకు మళ్ళి సిద్ధమయ్యారు. 1820 నుంచి 1870 ప్రాంతం వరకు సాగిన ఈ తిరుగుబాటు వహాబీ ఉద్యమంగా ఖ్యాతిగాంచింది. రాయ్‌బరేలీకి చెందిన సయ్యద్ అహ్మద్ బరేల్వీ ఈ ఉద్యమానికి ఆద్యుడు. ఈ పోరాటానికి నాయకత్వం వహించి అమరులైన వారిలో టిటూమీర్, అబ్దుల్ అజీజ్, ముహమ్మద్ ముహ్సిన్, దూదూ మియాc, ఇనాయత్ అలీ ప్రముఖులు. ఈ యోధులు సుదీర్ఘ కాలం సాగించిన పోరుకు సంబంధించిన విజయాలను, ఆ పోరాట యోధులు పాల్గొన్న చరిత్రాత్మక సంఘటల గురించి బెంగాల్ తదితర ప్రాంతాల ప్రజలు ఈ నాటికి స్మరించుకుంటున్నారంటే, ఆ పోరాటాల ప్రాముఖ్యతను ఊహించగలం. ఈ ఉద్యమం వహాబీ ఉద్యమంగా ఖ్యాతిగాంచింది.

"మా మతాలు వేరైనా మా మాతృ భూమి ఒక్కటే. మా లక్ష్యం ఒక్కటే అంటూ చెంప పెట్టు పెట్టారు."
- భారత ప్రజలు

telgo fbrvry.indd 10 3/11/12 11:54 AM

బ్రిటీషర్ల పాలిట భయంకరుడు టిపూ

బ్రిటిష్ పాలకుల రాజ్య విస్తరణ కాంక్షను గుర్తించిన టిపూ సుల్తాన్ ముంచుకు రానున్న ప్రమాదం గురించి సమకాలీన పాలకులను హెచ్చరించారు. టిపూ సుల్తాన్‌గా ఖ్యాతిగాంచిన ఫతె అలీ మైసూర్ సామ్రాజ్యాధినేత. బ్రిటష్ పాలకుల కుట్రలు కుయుక్తులను పసి గట్టిన ఆయన ఆ విషయాలను వివరిస్తూ 1780 దశకంలోనే స్వదేశీ పాలకులకు అనేక ఉత్తరాలు రాశారు. బ్రిటష్ పాలకుల ఎత్తులను చిత్తు చేస్తూ విరోచితంగా పోరాడుతూ స్వదేశీ పాలకుల్ని తనతో కలిసి రావాల్సిందిగా కోరారు. ముందు చూపు లేని స్వార్థపరులైన పాలకులు టిపూ హెచ్చరికలను ఖాతరు చెయ్యకపోగా, బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా మారారు. 'స్వదేశీ పాలకులు టిపూ మాటను గౌరవించి ఉంటే ఈనాడు ఈ నేల మీద మేం పాలకులుగా ఉండేవాళ్ళ కాదని' బ్రిటష్ అధికారులే ప్రకటించారంటే టిపూ ప్రయత్నాలు ఎంతటి ప్రాముఖ్యత గలవో అర్థం చేసుకోవచ్చు.

'భారతీయుల్లారా! లేవండి!! దైవం మనషికి ఎన్నో వనరులను ఇచ్చాడు. అందులో విలువైనది స్వాతంత్ర్యం' - బహద్దూర్ షా జఫర్

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం

టిపూ తర్వాత 1857లో మొగల్ పాదుషా బహద్దూర్ షా జఫర్ నాయకత్వంలో సాగిన సమరం ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా ప్రసిద్ధి చెందింది. ఈ పోరాటంలో భాగంగా అవద్‌కు చెందిన బేగం హజరత్ మహల్ విదేశీ పాలకులతో పోరాడి వారిని తరిమికొట్టి, చుట్టుముట్టిన శత్రు బలగాలను సవాల్ చేసి 14 మాసాల పాటు నిలువరించి, కలిసి వచ్చిన స్వదేశీ పాలకులకు స్ఫూర్తినిస్తూ, సంక్లిష్ట సమయంలో రాజ్య భారాన్ని వహించారు. స్వయంగా ఏనుగు అంబారినెక్కి ఆంగ్లేయులతో సాగిన పోరాటాల లో ఆమె పాల్గొన్నారు. **'మాతృ దేశం కోసం సాగుతున్న పోరాటంలో భాగస్వాములవ్వండి. శత్రువులను సంహరించండి. ఆశ్రయం ఇవ్వకండి. హిందూ-ముస్లింలకు ధర్మం, గౌరవం, ప్రాణం, ధనం అను నాలుగు అంశాలు ప్రధానం. ఆ అంశాలను స్వదేశీ పాలనలో, స్వదేశీ పాలకులు మాత్రమే ప్రసాదించగలరు' అంటూ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులకు వ్యతిరేకంగా పోరాట పటమను సాగించిన హజత్ మహల్‌కు ఝాన్సీ రాణి లక్ష్మిభాయికి లభించినంత ప్రాచుర్యం (చరిత్ర పుస్తకాలలో) లభించ లేదు.** (లభించకపోవడం నిజంగా ప్రతి ఒక్కరూ చిత్త శుద్ధితో ఆత్మస్తుతి మాని ఆత్మ విమర్శ చేసుకో వాల్సిన, ఆలోచించాల్సిన విషయమే).

'స్వదేశీ పాలకులు టిపూ మాటను గౌరవించి ఉంటే ఈనాడు ఈ నేల మీద మేం పాలకులుగా ఉండేవాళ్ళ కాదు'
- బ్రిటష్ అధికారులు

వెల్లివిరిసిన అద్భుత ఐక్యత

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందూ- ముస్లిం ప్రజానికం మధ్యన వెల్లి విరిసిన ఐక్యత ఆగ్లేయుల గుండెల్లో గుబులు పుట్టిం చింది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి చోదక శక్తిగా నిలిచింది ముస్లింలన్న భావనతోనున్న పాలక వర్గాలు, ప్రజానికంలో మత విభేదాలు సృష్టించి, స్నేహ బంధాలను విచ్ఛిన్నం చేసి తన మను గడకు ఎటువంటి ముప్పు లేకుండా చూసుకోవాలనుకున్నాయి.

ఈ ప్రయత్నంలో ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను రెచ్చ గొట్టి, మభ్య పెట్టి డబ్బుతో ప్రజల దేశాభిమానాన్ని కొను గోలు చేసేందుకు భారీగా డబ్బు సంచులు రప్పించారు. అయితే ఆ పాపిష్టి సొమ్ము మా ఐక్యత ముందు దిగదుడుపు అని ప్రజలు తిరస్కరించారు. మా మతాలు వేరైనా మా మాతృ భూమి ఒక్కటే.

భారత భాగ్య విధాతల్లారా! రేపటి ఆశా దీపాల్లారా!!

భారత భాగ్య విధాతల్లారా!
ఈ అవని మీ జనని
ఈ దేశం మీ ధరణి
ఈ భువనం ఆ గగనం
ఈ సముద్రం ఆ పర్వతం
అంతా మీ సొంతం
చెయ్యవోయి దైవ దాస్యం

రేపటి ఆశా దీపాల్లారా!
ఆ చిత్రం మీ స్వప్నం
ఆ శిల్పం మీ నైపుణ్యం
ఆ కావ్యం ఈ కథనం
ఆ గేయం ఈ రాగం
ఆ గ్రంథం ఈ వచనం
అంతా దైవానుగ్రహం
నమ్మవోయి ఈ నిజం!

భారత భాగ్య విధాతల్లారా!
ఈ భవనం ఆ వరణం
ఆ యంత్రం ఈ చక్రం
ఈ కోట ఆ పేట
ఆ ధాన్యం ఈ మూల్యం
అంతా క్షణభంగురం
ఎరుగవోయి ఈ సత్యం!

రేపటి ఆశాదీపాల్లారా!
మీ లక్ష్యం దైవ దర్శనం
మీ గమ్యం స్వర్గ ధామం
మీ ధ్యేయం లోక న్యాయం
మీ కర్తవ్యం సృష్టి శ్రేయం
మీ స్వప్నం సత్సమాజం
చేధించవోయి నీ లక్ష్యం
పండునోయి నిండు స్వాతంత్ర్యం

telgo fbrvry.indd 11 3/11/12 11:54 AM

ముస్లిం జీవితానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు

ప్ర: ప్రేమ ఎన్ని రకాలు?

జ: ప్రేమ నాలుగు రకాలు:

1) అల్లాహ్ పట్ల ప్రేమ:– ధర్మానికి (దీన్‌కు) ప్రాతిపదిక అసలు ఇదే.

2) అల్లాహ్ కోసం ప్రేమించటం:– సర్వ సాధారణంగా ముస్లిం పట్ల కలిగి ఉండే ప్రేమ ఇది. అయితే మరి కొంత మంది పట్ల వారు చేసే గొప్ప పనులను బట్టి, అల్లాహ్ విధేయతకు సంబంధించిన కార్యాలను బట్టి ఎక్కువ ప్రేమ పెంపొందుతుంది. ఇది తప్పనిసరి కూడా.

3) అల్లాహ్‌తో పాటు ప్రేమలో మరో పార్ట్‌నర్‌ని కల్పించటం:– ఇది అల్లాహ్ పట్ల గల తప్పనిసరి ప్రేమలో దైవేతరునికి భాగస్వామ్యం కల్పించటంగా పరిగణించబడుతుంది. ఇదే అసలు షిర్క్‌కు మూలం.

4) సహజ ప్రేమ:– తల్లిదండ్రులపట్ల, సంతానం పట్ల ప్రేమ. భోజనారుల పట్ల ప్రేమ – ఇలాంటివి సమ్మతమే.

ప్ర: స్నేహం – శత్రుత్వం దృష్ట్యా ప్రజలలో ఎన్ని రకాల వారుంటారు?

జ: మూడు రకాల వారుంటారు:

1) మొదటి (రకం) వారి పట్ల స్వచ్ఛమైన ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. వీరితో శత్రుత్వం అనేది కలలో కూడా ఊహించ కూడదు. ఎందుకంటే వీరు అత్యుత్తమ శ్రేణికి చెందిన విశ్వాసులు. ఉదాహరణకు:– ప్రవక్తలు, సిద్దీఖులు, అమరగతులు, సజ్జనులు. వీరందరలోకీ అగ్రజులు ముహమ్మద్ (స) మరియు ఆయన సతీమణులు, ఆయన కుమార్తెలు, ఆయన ప్రియ సహచరులు.

2) స్నేహానికి తగనివారు:– అవిశ్వాసులు. గ్రంథవహులు, ముష్రిక్కులు, కపటులు మొదలగువారు.

3) మూడవ వర్గం: పాపాత్ములైన ముస్లింలు వీరిపట్ల ఒకరకంగా ప్రేమ, మరో రకంగా ద్వేషం కలిగి ఉండాలి. అంటే వారిలోని విశ్వాసం(ఈమాన్) కారణంగా వారిని ప్రేమించాలి. వారిలోని పాపాలు, చెడుగుల కారణంగా వారిని ద్వేషించాలి.

ప్ర: గ్రంథం గల ప్రజలను విశ్వాసులుగా పరిగణింపచ్చునా?

జ: యూదులుగానీ, క్రైస్తవులుగానీ, మరే ఇతర మతస్తులుగానీ – వారు అవలంబించే ధార్మిక మూలాలు సరైనవే అయినప్పటికీ వారు విశ్వాసులు (మోమిన్లు) కాజాలరు. ఎందుకంటే ముహమ్మద్ (స) ప్రవక్త వచ్చిన తరువాత, ఏ వ్యక్తి అయినా సరే తన పాత ధర్మాన్ని విడనాడి ఇస్లాం స్వీకరించనంత వరకూ ముస్లిం గానీ, మోమిన్‌గాని అనిపించుకోడు. అతని ధర్మం (దీన్) సమ్మతించ బడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేరిపోతాడు". (ఆలి ఇమ్రాన్–85)

ఒకవేళ ఏ ముస్లిం అయినా అలాంటి వారిని అవిశ్వాసి అనటానికి ఊగిసలాడితే, వారి మత ధర్మాన్ని అసత్యం లేక మిథ్య అని చెప్పటానికి వెనుకంజవేస్తే మరి అతని గురించే శంకించ వలసి వస్తుంది. ఎందుకంటే అతను దైవం మరియు దైవప్రవక్త (స)ల ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నాడు. దైవాజ్ఞ ఏమిటో చూడండి:

"వారందరిలోనూ ఎవడయినాసరే దానిని త్రోసిపుచ్చినట్లయితే అతనికి వాగ్దానం చేయబడిన గమ్యస్థానం నరకం అవుతుంది".

(హూద్: 17)

ఈ నేపథ్యంలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) వారు ఏం చెప్పారో కూడా గమనించాలి. ఆయన (స) చాలా స్పష్టంగా ఇలా అన్నారు: **"ఎవరి అధీనంలో ముహమ్మద్(స) ప్రాణాలున్నాయో ఆ శక్తిమంతుని సాక్షి! ఈ సముదాయంలో ఎవడయినా సరే అతడు యూదుడు కానివ్వండి, క్రైస్తవుడు కానివ్వండి– నా గురించి విన్నప్పటికీ, నాకిచ్చి పంపబడిన షరీయతు (ధర్మ శాస్త్రము)ను నమ్మనడుచుకోకపోతే నరకానికి ఆహుతి అవుతాడు"** (ముస్లిం)

ప్ర: అవిశ్వాసుల (కాఫిర్ల)పై జులుం చేయటం సమ్మతమేనా?

జ: జులుం (అన్యాయం, అక్రమం, దౌర్జన్యం) ఎంత మాత్రం సమ్మతం కాదు, అది అధర్మం, హరామ్. తమ విషయంలోనయినా, పరాయి వాళ్ళ విషయంలోనయినా జులుం సమ్మతించ బడదు. హదీసె ఖుద్సీలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నేను నాపై జులుం(అన్యాయము)ను నిషేధించుకున్నాను. మీపైన కూడా దాన్ని నిషేధించాను. కనుక మీరు ఒండోకరిపై అన్యాయానికి ఒడిగట్టకండి". (ముస్లిం)

ప్ర: 'బిద్‌అత్' అని దేనినంటారు?

జ: ఇబ్నె రజబ్ (ర) ఇలా తెలిపారు – షరీయత్‌లో ఏ విధమైన ఆధారం లేక పోయినప్పటికీ దీన్(ధర్మం)పేరిట ఆవిష్కరించ బడిన కొత్త పోకడను ' బిద్‌అత్' అంటారు. ఒకవేళ షరీయతులో దానికి సంబంధించిన 'మూలం' గనక ఉన్నట్లయితే అది శాస్త్రపరంగా బిద్‌అత్ అనబడదు.

ప్ర: దీన్ (ధర్మం)లో 'బిద్‌అతె హసన' (మంచి బిద్‌అత్) మరియు 'బిద్‌అతె సయ్యిఅ' (చెడు బిద్‌అత్) అనేవి ఉంటాయా?

జ: షరీయతు భావార్థం దృష్ట్యా బిద్‌అత్‌ను ఖండించే దైవ వాక్యాలు, ప్రవక్త ప్రవచనాలు ఉన్నాయి. షరీయతులో ఎలాంటి **'మూలం'** లేక పోయినప్పటికీ ధర్మం పేరిట కల్పించుకోబడిన నవీన ఆచారాలను బిద్‌అత్‌లుగా వ్యవహరిస్తారు. మహాప్రవక్త (స) ఇలా చెప్పారు: **"ఎవరయినా సరే మేము ఆజ్ఞాపించని ఆచరణకు శ్రీకారం చుట్టినట్లయితే అట్టి ఆచరణ త్రోసిపుచ్చబడుతుంది. అది స్వీకారయోగ్యమవదు."** (బుఖారీ, ముస్లిం)

ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: "(ధర్మంలో) ప్రతి కొత్త ఆచారం బిద్‌అతే, ప్రతి బిద్‌అత్ మార్గభ్రష్టతే". (ముస్లిం)

telgo fbrvry.indd 12 3/11/12 11:54 AM



అబుల్ హసన్

ఇమామ్ ముస్లిం (ర) ఎటు మన పయనం?

సహీహ్ ముస్లిం గ్రంథాన్ని సంకలనం చేసిన ఇమామ్ అబుల్ హుసైన్ ముస్లిం బిన్ హిజాజ్ (ర) హిజ్రీ శకం 204లో నీషాపూర్‌లో జన్మించారు. బాల్యం నుండే హదీసు విద్యార్జనలో నిమగ్నులయిపోయారు. హదీసుల అన్వేషణ కోసం ఆయన ఇరాఖ్, హిజాజ్, ఈజిప్టు దేశాలు పర్యటించి, అక్కడి పండితుల దగ్గర హదీసులు నేర్చుకున్నారు. అలాంటి పండితులలో ఇమామ్ బుఖారీ(ర) గారి గురువులు కూడా ఉన్నారు. చివరికి ఆయన నీషాపూర్‌లో ఇమామ్ బుఖారీ (ర)ని కలుసుకొని, ఆయన దగ్గర కూడా శిష్యరికం చేశారు.

ఆ కాలంలో గొప్ప గొప్ప హదీసువేత్తలు సయితం తరచుగా ఇమామ్ ముస్లిం (ర) దగ్గరకొచ్చి హదీసులు వినిపోతుండేవారు. వారిలో అబూ హాతిం రాజి (ర), మూసా బిన్ హారూన్ (ర), అహ్మద్ బిన్ సలమా (ర), ఇమామ్ తిర్మిజీ (ర) ప్రభృతులు కూడా ఉన్నారు. ఆయన బాల్యం నుండి అంతిమ శ్వాస వరకు ఎంతో దైవభీతి, ధర్మపరాయణతలతో కూడిన పవిత్ర జీవితం గడిపారు. ఆయన ఏనాడూ ఒకరిని నిందించడం గాని, బాధించడం గాని చేయలేదు.

ఇమామ్ ముస్లిం మరణ సంఘటన చాలా విచిత్రంగా జరిగింది. ఒక సారి ఓ పండిత గోష్ఠిలో ఒక వ్యక్తి ఏదో హదీ సుని గురించి సమాచారం అడిగాడు. అయితే ఆ సమయంలో ఇమామ్ గారికి ఆ హదీసు గురించిన సరయిన వివరాలు తెలియకపోవడం వల్ల సమాధానం ఇవ్వలేకపోయారు. తరువాత ఆయన ఇంటికి వెళ్ళి ఆ హదీసుని అన్వేషించడం ప్రారంభిం చారు. గ్రంథ పుటలను తిరగేస్తూ ప్రక్కనే ఉన్న ఖర్జూరపండ్ల బుట్టలో నుంచి ఒక్కొక్క ఖర్జూరాన్ని తీసి తింటూ పోయారు. హదీసు అన్వేషణలో తానెన్ని ఖర్జూర పండ్లు తిన్నానన్న సంగతిని కూడా గమనించలేదు. చివరికి అన్వేషిస్తున్న హదీసు లభించిన తరువాత బుట్ట వైపు చూస్తే అది దాదాపు ఖాలీ అయిపోయింది. అప్పుడర్థమైంది ఆయనకు తాను బుట్టలోని పండ్లన్నీ తిన్నాని. కాని ఇక చేసేదేమీ లేదు; జరగవలసింది జరిగిపోయింది. ఎక్కువ పండ్లు తినడం వల్ల ఆయన వ్యాధిగ్రస్తులయ్యారు. ఆ వ్యాధితోనే ఆయన హిజ్రీ శకం 261, రజబ్ నెల 24వ తేదీ ఆదివారం నాడు సాయంత్రం శాశ్వతంగా ఇహలోకం వీడిపో యారు. చనిపోయేనాటికి ఆయన వయస్సు 55 సంవత్సరాలు మాత్రమే. స్వగ్రామమైన నీషాపూర్‌లోనే ఆయన్ని ఖననం చేశారు.

అబూహాతిం (ర) ఇలా తెలియజేస్తున్నారు: "ఇమామ్ ముస్లిం (ర) చనిపోయిన తరువాత ఓ రాత్రి నేను ఆయన్ని కలలో చూశాను. ఆయన దగ్గరికెళ్ళి మీ పరిస్థితి ఎలా ఉందని అడిగాను. దానికి ఇమామ్ ముస్లిం (ర) **'దేవుడు తనకు మంచి స్థితి కల్పించాడని, స్వర్గంలో తాను కోరుకున్న ప్రదేశానికి వెళ్ళే, కోరుకున్న చోట ఉండే అనుమతినిచ్చాడ'**ని అన్నారు."

ఎవరితో మన జీవితము
ఎందాక మన పయనము
కలవంటి మన జీవితము
కడు స్వల్ప కాలము

తళుకుబెళుకుల ఈ నివాసము
తాత్కాలిక ఓ తటాకము
అమూల్యమైన మన జీవితము
కాకూడదు సుమా వ్యర్థము

గడ్డిపోచ నుంచి గగనతలం వరకు
విశ్వమంతా ఓ రంగుల పరదా
నిష్కల్మష మనస్సు నిర్మల జ్ఞానంతో
అన్వేషించువారు తెలుసుకుంటారు సత్యము

మనల్ని ఆకర్షించే ఈ విశ్వము
కాటు వేసే కాళ సర్పము
పాప కూపము భయంకర నరకము
పాపభీతి పరలోక మోక్షము

మిత్రమా!
కష్టనష్టాలొచ్చాయని కుమిలిపోకోయి
సుఖసౌఖ్యాలభించాయని మిడిసి పడకోయి
గెలుపోటములు సహజమోయి
స్వర్గ అధిరోహణం మనందరి లక్ష్యమోయి

దుస్తులు కాదోయీ ముఖ్యము
దైవభీతియే ప్రధానము
దైవ కారుణ్యము అనంతము
పశ్చాత్తాపమొకటే మార్గము

మరువకోయి ఈ సత్యము
స్వయం సమర్పణయే సాఫల్యము
ప్రవక్త ప్రవచనాలు ఆదర్శము
దైవ దర్శనం మన గమ్యము

అశాంతి – అంధకారమోయి
శాంతి–దివ్య తేజమోయి
మనశ్శాంతి దైవ కీర్తనోయి
విశ్వశాంతి మనందరి ధ్యేయమోయి

telgo fbrvry.indd 13 3/11/12 11:54 AM



గోధుమ రవ్వాతో రొయ్యల సూపు

కావలసిన సామగ్రి:
ఒలిచి శుభ్ర పరచిన చిన్న రొయ్యలు: 2 కప్పులు
కూసా (తురిమినవి): 2 మీడియమ్ సైజు
క్యారెట్లు (తురిమినది): 2 మీడియమ్ సైజు
కొత్తి మీర: 1 కట్ట
సోయాకు (అష్షబంత్): 1 కట్ట
కుర్రాస్: 1 మీడియమ్ సైజు కాడ
మొక్క జొన్న: 1 టిన్ను (డబ్బా)
చప్పటి ఎర్ర మిరపకాయ: 1 మధ్య సైజు
గోధుమ రవ్వ: 8 టేబల్ స్పూన్లు
తరిగిన ఉల్లిపాయలు: 2 మధ్య సైజు
వెల్లుల్లిపాయలు: 1 1/2 (ఒకటిన్నర)టీ స్పూను
సన్నవి ముక్కలుగా చేసిన అల్లం: 1 టీ స్పూను
విజిటేబుల్ ఆయిల్: 5 టేబల్ స్పూన్లు
ధనియాల పొడి: 3/4(ముప్పావు) టీ స్పూను
కర్రీ పొడి: 1/4 (పావు) టీ స్పూను
జీలకర్ర పొడి: 1 టీ స్పూను
నల్ల మిరియాల పొడి: 1/4 టీ స్పూను
మరిగిన నీరు: 4 1/2 కప్పులు (నాలుగున్నర కప్పులు)

తయారు చేయు విధానము:

● ఒక పాత్రలో నూనె పోసి వేడి చేయాలి, దానిలో తరిగిన ఉల్లిపాయలు, వెల్లుల్లిపాయలు విజిటేబల్ సూప్ బిళ్ళలు మరియు అల్లం వేసి 2 నిమిషాలు లేక ఉల్లిపాయలు కొంచెం బ్రౌన్ అయ్యేంత వరకు అలాగే సన్నని మంటపై వేగనివ్వాలి.

● రొయ్యలు వేగే మసాలాలపై వేసి మంట కాస్త పెంచాలి, ఒక నిమిషము అన్నీ కలిపి మిగిలిన సామగ్రిని అందులో వేయాలి. నీరు, రవ్వ మరియు బట్టరు తప్ప, అన్నింటినీ చక్కగా రెండు నిమిషాలుగా కలపాలి.

● రవ్వా మరియు మొక్కజొన్న వేసి కలుపుతూ ఒక నిమిషము తరువాత నీరు పోయాలి, ఉడకే సూపును అలాగే పెద్ద మంటపై వదలాలి, అది మరగడం మొదలవునప్పుడు మంట చిన్నగా చేసి అర గంట వరకు ఆ సూప్‌ను చిన్న మంటపై అలాగే ఉంచాలి. రుచికరమైన సూప్ రెడి.

షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయి

ప్రూ పరిమళం

ఉమ్మహాత్: (ఉమ్ అంటే అరబీలో తల్లి, మాతృక అన్న అర్థాలొస్తాయి).
1) ఉమ్ కాని సృష్టించబడలేదు- సూరతుల్ ఫాతిహా (ఉమ్ముల్ కితాబ్ - ఖుర్ఆన్ గ్రంథానికి మాతృక)
2) ఉమ్ కాని జన్మించలేదు - హవ్వా(అ). ఉమ్ముల్ బషర్ - సమస్త మానవులకు తల్లి.
3) ఉమ్ కాని సంతానం లేదు -ఆయిషా (ర). ఉమ్ముల్ మోమినీన్ - విశ్వాసుల మాత.
4) ఉమ్ కాని, పురుష సంపర్కం లేదు - మర్యం (అ). ఉమ్ముల్ మసీహ్- ఈసా (అ) వారి మాతృమూర్తి.
5) ఉమ్ కాని ప్రాణి కాదు - మక్కా. ఉమ్ముల్ ఖురా - పల్లెలకు తల్లి.

జయాపజయాలకు కారకాలు మూడు:
ఒక వ్యాపారిలో 3 గుణాలు లేకపోతే ఇహపరలోకాలలో దారిద్రమే. 1) నాలుకను 3 గుణాల నుండి కాపాడు కోవడం: అబద్ధం,నిరర్థకమైన పనులు, హలఫ్ - ఒట్టు.
2) 3 గుణాల నుండి దూరంగా ఉండటం: మోసం, ఖియానత్, అసూయ.
3) మూడింటిని భద్రపరుచుకోవటం: జుమా, జమాఅత్, కాస్త సమయం విద్యార్జన కోసం కేటాయించటం.

అవమానం - అపకీర్తి:
తొందరపాటుతో దూరంగా ఉండండి, ఎందుకనగా తొందర పాటు "ఉమ్మున్నదామహ్" అనగా అవమానానికి అసలు కార ణం, మాతృక. తొందరపడేవారు తెలుసుకోక ముందే, అర్థం చేసుకోకముందే, ఆలోచించిక ముందే చెప్పటాన్ని ఇష్టపడతారు, దక్కక ముందే పోగొట్టుకుంటారు, ఒకర్ని పరిక్షించక ముందే పొగడుతారు లేదా చెడు ప్రచారం చేస్తారు. ఈ గుణాలే అవ మానానికి పరాభవానికి మూలకారణం.

అన్యాయం యొక్క దుష్ఫలితం:
షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియ (ర) ఇలా తెలియజేశారు: ఒక విషయంలో ప్రజలకు ఏకీభావం ఉంది అదేమనగా "అవిశ్వాసు లైనా సరే న్యాయంతో కూడిన దేశంపై అల్లాహ్ సహాయం చేస్తాడు. అన్యాయం జరిగే దేశం పై అల్లాహ్ సహాయం ఉండదు విశ్వాసులైనా సరే".

సహనానికి సత్ఫలితం: అమర్ బిన్ హద్దాబ్‌కు కంటిచూపు పోయిన తరువాత, ఇబ్రాహీం బిన్ ముజాషి అతన్నుద్దేశించి "యా అబా ఉసైద్! చూపు పోయినందుకు దుఖించకు, దీని కార ణాన పరలోకంలో దక్కే ప్రతిఫలాన్ని నీవు తెలుసుకుంటే అప్పుడు నీవు అల్లాహ్ నాకు కాళ్ళు చేతులు కూడా లేని వానిగా చేసి ఉంటే ఎంత బావుండు అని కోరుకుంటావు' అని హితవు పలికారు.

telgo fbrvry.indd 14 3/11/12 11:54 AM

బాధ్యతలను ఉత్తమ రీతిలో నిర్వర్తించండి

4. యజమానుల రహస్యాలు, వారి సమస్యలు విని లేక చూసి మీ స్నేహితుల మధ్య చర్చించుకోకూడదు. ఇంటి గుట్టు ఇతరుల ముందు రట్టు చేయడం తప్పు. ఒక మాట ఎప్పుడూ గుర్తుంచుకోవాలి – అదేమిటంటే మీరు ఉండే ఇంటికి మీరు కాపలాదారులు. దాని పరువుప్రతిష్ఠల్ని, పవిత్రతను కాపాడటం మీ బాధ్యత.

5. ఇంటికి అతిథులొచ్చినచో తలుపు సాదరంగా తెరిచి, నగుమోముతో ఆహ్వానిస్తూ లోనికి తీసికెళ్ళాలి. యజమానొచ్చేంత వరకు అతిథి మర్యాదల్ని అందివ్వాలి. ఒకవేళ అతిథులు మాట్లాడుకుంటుంటే వారి మధ్యలో జోక్యం చేసుకోకూడదు.

6. ఒకవేళ అతిథులు పిల్లలతో ఉండి వారిని కనిపెట్టుకుని ఉండమని మీకు అప్పగించినచో వారిని ఈసడించుకోకూడదు. వారిని చూచుటకు మీకు జీతమివ్వబడటం లేదు అయినప్పటికీ సభ్యతా సంస్కారాల రీత్యా, ఇస్లాం ఆదేశాల దృష్ట్యా అతిథికి మర్యాద చేయడం చాలా ముఖ్యం.

7. ఒకవేళ మీ యజమానులు ఎచ్చటకైనా ప్రయాణిస్తూ మిమ్మల్ని వారి చుట్టాల ఇంట్లో వదిలి వెళ్ళిన యెడల వారిపై కోపగించుకోకూడదు. ఆ ఇంటి రహస్యాలను ఈ ఇంటి వారి ముందు బయట పెట్టకూడదు. రెండు కుటుంబాల మధ్య కలతలు పెంచటానికి ప్రయత్నించకూడదు. ఒకరినొకరికి మధ్య మనస్పర్థలను జనింపచేయకూడదు. ఇంట్లో పని చేయుటకు ఏ వస్తువైనా ఉపయోగించటానికి ముందు (టెలిఫోను, టేప్ రికార్డరు, వేక్యూమ్ క్లీనరు, (చీపురు) లేదా మరేవైనా (విద్యుత్ యంత్రాలు) యజమాని అనుమతి తీసుకొనుట మంచిది. ఇది మీ మంచి అలవాట్లకు మరియు ఉత్తమ నడవడికకు నిదర్శనంగా నిలుస్తుంది.

8. ఒకవేళ మీకు బట్టలుతకమని, లేదా ఏవైనా విద్యుత్ సామగ్రిని లేదా వంట పాత్రలు కడగమని ఆజ్ఞాపిస్తే వాటిని పగలకుండా లేక పాడవకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ ఏదైనా వస్తువు మీ ద్వారా పగిలిపోతే వెంటనే మీ యజమానురాలికి తెలియ పరచాలి, ఎట్టి పరిస్థితులలోను అబద్ధమాడరాదు.

9. డబ్బును దుబారా చేయకుండా పొదుపుగా వాడుకోవాలి. పిసినారితనం దుబారా ఖర్చు రెండూనూ చేయకూడదు. ఎందుకంటే ఈ రెండు అలవాట్లు ఇస్లామ్ ఖండించింది. కనుక క్రింద ఇవ్వబడిన కొన్ని వస్తువులను వృధా చేయరాదు.

నీరు పొదుపుగా వాడడం

ఏ కారణం లేకుండా నీటి పంపును వృధాగా వదలరాదు. కార్లు కడుగునపుడు, వరాండా కడుగునపుడు లేదా మొక్కలకు నీరు పోయునపుడు నీటిని పొదుపుగా వాడాలి. ఇష్టమొచ్చినట్లు నీటిని పారపోయరాదు.

విద్యుచ్ఛక్తిని వృధా చేయకూడదు

ఏ విద్యుత్ సాధనాలను కూడా ఇంట్లో అవసరము లేనిదే వృధాగా వాడరాదు. ఉదాహరణకు లైట్లు, ఫ్యాన్లు ఏసీలు మరియు ఏ విద్యుత్ సాధనాలైనా అవసరము లేనిదే ఉపయోగించరాదు.

అనవసరంగా తినుభండారాలు ఉపయోగించుట

అవసరం కంటే ఎక్కువగా భోజనాలు వండరాదు. సరిపడునంతనే వండాలి. తిను భండారాలు మిగిలినచో వాటిని చెత్తగా పడేయకుండా వాటిని చక్కగా మూసి ఫ్రిడ్జులో భద్ర పరచాలి. పండ్లు మరియు కూరగాయలు సాధ్యమైనంత కాలము క్రుళ్ళి పోకుండా తాజాగా ఉండుటకు వాటిలోని మంచి పండ్లు మరియు కూరగాయల్ని చెడిపోయిన వాటినుండి వేరుచేసి భద్రపరచే పద్ధతిలో ఫ్రిడ్జిలో భద్ర పరచాలి.

భోజనాలలో మీ ఇష్టాయిష్టాలను మీ యజమానురాలికి తెలిపి వంట చేయాలి. అధిక రకాలుగా మరియు అనవసరమైన వంటకాలు వండి వృధా చేయకుండా అవసరమైన వంటలే వండాలి.

మీ చుట్టున్న పురుషులతో ఎలా వ్యవహరించాలి?

అపరిచిత పురుషులమధ్య ఒక స్త్రీ శీల రక్షణకై ఎలా మెలగవలసి ఉన్నదో ఖుర్ఆన్ మరియు ప్రవక్త ముహమ్మద్ (స) గారి ప్రవచనాల ద్వారా (ఇస్లామీయ సాంప్రదాయాల్లో) ప్రబోధింప బడినది. ఇస్లాంలో స్త్రీ యొక్క గొప్ప స్థానాన్ని స్పష్టంగా తెలుపబడింది.

దుస్తులు ధరించుటలో హుందాతనం ఉండాలి. మీ దేశాల్లో ధరించే దుస్తులను ధరించరాదు. కారణం మీరు ఉంటుంది ఒక ముస్లిమ్ ఇంట్లో. మీ సంస్కృతి – ఇక్కడి సంస్కృతికి ఎంతో భేదముంది. అదీకాక వ్యక్తిత్వ వికాసానికి మరియు ఇతరుల ఆదరణ పొందటానికి చక్కటి నిండు దుస్తులు వేసుకోవడం చాల అవసరం. మన మంచి వస్త్రధారణ మనల్ని ఆదరించుటకు ఇతరులను సమాయత్త పరుస్తుంది.

పురుషులతో సంభాషించునపుడు వినయంతో మరియు మితంగా అవసరమైతేనే తప్ప మాట్లాడకూడదు. అది కూడా ఇంట్లోని వారితో లేదా పనివాళ్ళు (అవసరం గల వారితో) మాత్రమే మాట్లాడాలి.

telgo fbrvry.indd 15 3/11/12 11:54 AM

ఐపిసి ఆధ్వర్యంలో 'ఈదుల్ వతనీ'

ఐపిసి ఆధ్వర్యంలో 24 - 02- 2012 వ తేదీ శుక్రవారం నాడు కువైట్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మరియు జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన విహార యాత్ర విజయవంతంగా జరిగింది. అన్ని భాషలకు చెందిన న్యూ ముస్లిం సోదరులు ఈ సందర్భంగా నిర్వహించబడిన క్రీడాపోటీల్లో, సాంస్కృతిక పోటీల్లో ఎంతో చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్య క్రమానికి వివిధ బ్రాంచీలకు చెందిన ధర్మ ప్రబోధకులు కూడా హాజరయ్యారు. నమాజ్ మరియు క్రీడా విన్యాసాలు, భోజ నాల తర్వాత ఐపిసి దావా విభాగ అధ్యక్షులు అందరిని ఉద్దేశించి ప్రసంగించారు. పరస్పరం సోదరులగా అన్నదమ్ములుగా మసలుకోవాలని కోరారు. ఒండొకర్ని అర్థం చేసుకోవాలని, అపార్థం చేసుకోరాదని, ఒకరి సంకల్పాన్ని శంకించరాదని హితవు పలికారు. చివర్లో విజేతలందరికి బహుమతులు ప్రదానం చెయ్యబడ్డాయి.

ఐపిసి ఖైతాన్ బ్రాంచీ ఆధ్వర్యంలో విహార యాత్ర

ఐపిసి ఖైతాన్ బ్రాంచీ తెలుగు విభాగ ప్రబోధకులైన మౌలానా షేఖ్ అబ్దుస్సలాం ఉమ్రీ గారి నేతృత్వంలో ఒక విహార యాత్ర కార్యక్రమం శనివారం 28-01-2012న జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా న్యూ ముస్లిం సోదరులు ప్లానిటోరియంను సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా 'సృష్టి నిర్మాణం' అన్న అంశంపై ధర్మ ప్రబోధకులు మౌలానా షేఖ్ అబ్దుస్సలాం ఉమ్రీ గారు ప్రసంగించారు.

telgo fbrvry.indd 16 3/11/12 11:54 AM

ఐపిసి జహ్రా ఆధ్వర్యంలో 'స్మృతి సభ'

ఐపిసి తెలుగు విభాగం జహ్రా ఆధ్వర్యంలో 13- 02 - 2012వ తేదీ ప్రవక్త (స) వారి జన్మ దినాన్ని పురస్కరించుకొని జరిగిన ఈ కార్యక్రమంలో **'నేను ఉన్నత నైతిక విలువల పరిపూర్తికై ప్రభవింపజేయబడ్డాను'** అన్న అంశంపై ధర్మ పండితులు మౌలానా అబ్దుల్ హఫీజ్ గారు ప్రసంగించగా, **'ఐహిక వాస్తవికత'** అన్న అంశంపై తెలుగు ప్రబోధకుల మౌలానా సయ్యిద్ అహ్మద్ గారు సంభాషించారు. ఈ కార్యక్రమంలో 40 మంది ముస్లిం న్యూ ముస్లిం సోదరులు పాల్గొన్నారు. హాజరైన సోదరులందరూ ఐపిసి యాజమన్యానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

బ్రదర్ సుహైల్ వలీమా విందు

కడప నివాసి అయిన సుహైల్ ఇస్లాం ధర్మాన్ని బాగా అధ్యయనం చేసి స్వీకరించడమే కాక ముస్లిం కుటుంబానికి చెందిన అమ్మాయిని వారి తల్లిదండ్రుల అంగీకారంలో వివాహం చేసుకున్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన, తెలిసిన వారందరికి వలీమా విందు ఇచ్చారు. ఈ విందుకి అతిథులుగా విచ్చేసిన ఐపిసి ప్రబోధకులు, టిఎమ్ఎ కార్యకర్తలు ఆయన్ను అభినందించడంతోపాటు సన్మానించారు.

telgo fbrvry.indd 17 3/11/12 11:55 AM

తమస్సు తాలిగింది

(ఇది మనసు మనుషుల సంభాషణ. మనస్సనేది రెండు రకాలు: 1- తమస్సు-నఫ్సే అమ్మారా 2- ఉషస్సు-నఫ్సే లవ్వామా. మనసు ఒకటే అయినా రూపాలు రెండు. ఒకటి చీకట్లను నింపితే మరొకటి వెలుగుల్ని వ్యాపింపజేస్తుంది. తమస్సు అధీనంలో ఉన్నప్పుడు మనిషి ఎలా ఉంటాడో, ఉషస్సు వెలుగులో ఎలా జీవిస్తాడో తెలియజేసేందుకు వ్రాసినదే ఈ వ్యాసం. - శాంతి ప్రియ)

మనిషి: ఎక్కడిదీ వికటాట్టహాసం? కన్ను పొడుచుకున్నా కనిపించని ఈ కారు చీకటిలో ఎవరిదీ అట్టహాసం? ఎవరో ఇటే వస్తున్నారు. ఏయ్! ఎవరు నువ్వు?

తమస్సు: నేనా? నేనెవరో నీకు తెలియదా? నరుడా! పామరుడా! (వెకిలి నవ్వు....)

మనిషి: ఏమిటా నవ్వు? నీ వెకిలి నవ్వులలో హడలిపోయి వచ్చిన దారి తిరిగి పోయే పిరికిని కాను. నా సత్యాన్వేషణ సాగక తప్పదు. నా లక్ష్యాన్ని నేను సాధించక తప్పదు. నాకడ్డం నిలవకు. నన్ను వెళ్ళనీ. ఉషస్సు కాంతుల్లో ఊయాలలూగని. ఊc..

తమస్సు: ఎక్కడికి నీవు వెళ్ళేది?

మనిషి: అదంతా నీ కనవసరం.

తమస్సు: నాకూ? అనవసరమా? (వెకిలినవ్వు) మూర్ఖుడా! నాకనవసరమయింది ఈ జగాన ఉందా? ప్రతి మనిషిలో రక్తం కన్నా వేగంగా ప్రవహించే నాకే ఎదురు చెబుతావా? హాబిల్ ఎలా పరా జయం పాలయ్యాడో, నూహ్ కుమారుడు జల ప్రళయానికి ఎలా ఆహుతి అయ్యాడో, నమ్రూద్ ఎలా ప్రాణాలు వదిలాడో, ఫిర్‌ఔన్‌కు ఎలాంటి దుర్గతి పట్టిందో, ఖారూన్ ఏ విధంగా భూమిలో కూరుకుపోయాడో, అబూలహబ్, అబూజహల్ ఎలా తుడిచి పెట్టుకుపోయారో, నేడు ఎవరు నియంతలై వ్యవహరిస్తున్నారో, సారాయిలో ఉన్న కిక్కేమిటో, జూదంలో ఉన్న ట్రిక్కేమిటో, పాప భూయిష్ట లుక్కేమిటో, షిర్క్ చిక్కేమిటో చెప్పమంటావా? రహస్య చిట్టామొత్తం విప్పమంటావా?

మనిషి: చాలు చాలు, డాంబికాలకేం తక్కువ లేదు. అంతా తెలిసినట్టు మిడిసి పడుతున్నావే. ఇంతటిదానవై నా దారికెందుకు అడ్డంగా వస్తున్నావు? నన్నెందుకు సత్యాన్వేషణ మార్గం నుండి తప్పించ జూస్తున్నావు?

తమస్సు: నీ లక్ష్యం కాంతి అదో వట్టి భ్రాంతి. చీకటే శాశ్వితం, కాంతి తాత్కాలికం. నా మాట విను. ఇదే జీవితం ఇది తప్ప వేరే జీవితం లేదు. ఉంటుందని నువ్వనుకోవడం శుద్ధ వేస్టు. నీలి కన్నుల చినదానల్ని చూసి నీ కళ్ళు మిలమిల మెరుస్తుండగా, నీ మనస్సు ఊహాజగత్తులో నింగికి నీలాల నిచ్చెనలు వేస్తుండగా, నీ దేహం కోరికల గుర్రాలను కళ్ళెం లేకుండా తోలుతుండగా చూడాలని, చూసి ఆనందించాలని ఉంది. నా కోరికను తీర్చవూ ప్లీజ్!

మనిషి: ఓయీ! మాటల మాయతో మభ్యపెట్టే మాయావి. ఎవరు నీవు? నువ్వు నాతో మాట్లాడటం ఏమిటీ. నన్నిరికించి, ఉడికించి నా లక్ష్యం నుంచి తప్పించేందుకు ప్రయత్నించడం ఏమిటీ?

తమస్సు: బలే...బలే...నేనెవరో నీకు తెలీదా..? నేను నీ మనస్సుని.

మనిషి: నువ్వు తమస్సులా అన్పిస్తున్నావు.

తమస్సు: (కొంటెగా కళ్ళెగరేస్తూ) ఏం ఎలా ఉంది నా పేరు? భలే గుర్తుపట్టావే...

మనిషి: నా ప్రాణాలు తోడేట్టుంది. నన్ను నరక కూపంలో నెట్టేట్టుంది.

తమస్సు: పోనీ నేనెలా ఉన్నాను?

మనిషి: నన్ను నమిలి మింగేట్టున్నావు. నీకు పుణ్యముంటుంది నాదారి నన్ను పోనీ.

తమస్సు: వెర్రివాడా! నిన్ను నువ్వు వివేకి ననుకుంటున్నావు. నల్లదానవయిన నన్ను చూసి బెదిరిపోతున్నావు. భయపడుతున్నావు. నా నుంచి నువ్వు తప్పించుకోలేవు. అంతలో–

(ఈ తతంగమంతా చూస్తున్న ఉషస్సు రంగ ప్రవేశం చేస్తుంది)

telgo fbrvry.indd 18 3/11/12 11:55 AM

మనిషి: ఎంత విచిత్రం? కళ్ళకు మిరిమిట్లు గొలిపే కమనీయ మూర్తి. ఎంత శాంతం నీ వదనం! తేనె వెన్నెలలు కలిపి పోత బోసిన అపూర్వమూర్తి.

ఉషస్సు: అయ్యో మానవుడా! అప్పుడే కవిత్వంలో పడ్డావా? నీ లక్ష్యం మరచిపోయావా?

మనిషి: కవిత్వం అబద్ధమా?

ఉషస్సు: ఔను చాలా వరకు. **'పోయట్రీ ఇజ్ హాఫ్ లై'** అన్నారు. అలాగే **'అష్షుఅరావు యత్తబిఉహుముల్ గావూన్'** కవులు, దారి తప్పినవారే వారి వెనుక నడుస్తారు. అంటుంది ఖుర్ఆన్. **'నవ్వులా అవి; కావు నవపారిజాతాలు'** అంటే నిజమని సామాన్యుడు నమ్ముతాడా?

మనిషి: సత్యం–ఆలోచనామృత కలశం కవిత్వం. అది చరిత్ర చెబుతుంది అందంగా. నీ సుందర సుమనోహర కాంతి వదనాన్ని చూసి, ఒక్క క్షణం అలా విభ్రాంతుణ్ణయ్యాను. తమస్సుతోనే. జీవితం గడిపిన నాకు నీ వెలుగు వదన దర్శనం మహాభాగ్యం.

ఉషస్సు: సరే...సరే...వెలుతురంటున్నావే వెలుగు నీ మనసులో లేదూ?

మనిషి: నా హృదయం ఏనాడో బొగ్గయిపోయింది. దాన్ని మాణిక్యంగా మార్చే సత్యశక్తి కోసం గాలిస్తున్నాను. ఈ నాటికి నీవు కనిపించావు. నాకు సహాయ పడవా ప్లీజ్!

ఉషస్సు: ఇదిగో వెలుతురు....చూడు...చూడు. తారల కన్నుల్లో, మెరుపుల మెయి విరుపుల్లో వెలుతురు. కొండల్లో పూవనాల్లో వెలుతురు సెలయేటి గలగల్లో వెల్తురు. సిరిమల్లెల నవ్వుల్లో వెలుతురు.

మనిషి: నేను కోరింది ఈ కాంతి కాదు. హృదయ కాంతి. కొద్ది సేపటికి కనుమనుగయ్యే తారల్లో, తళుక్కుమని మెరిసి మాయమయ్యే మెరుపుల్లో, మరుక్షణంలో వాడిపోయే పూలల్లోనా వెలుతురు. మట్టి దీపమైనా, మణి దీపమైనా మనస్సులోని తమస్సులు తొలగవు.

ఉషస్సు: అవును తృప్తి కోసం, అలంకార నిమిత్తం మాత్రమే తప్ప ఈ దీపాలు హృదయాంధకారాన్ని తుడిచివేయలేవు. పైగా మనిషి వెలిగించే దీపాల కాంతి మనిషి చుట్టే ఉంటుంది. అది కూడా అసలయిన కాంతి కాదు. అసలు కాంతి మనసులో ఉండాలి.

నేను చెప్పేది కాస్త శ్రద్ధగా విను. (ఉషస్సు కంఠం మంద్ర గంభీరంగా వినిపిస్తున్నది). మానవులూ, పశుపక్షాదులూ పుట్టక ముందు, చెట్టూ చేమలూ మొలవక ముందు, దేవుడు ఈ సృష్టిలోని ప్రతి వస్తువునూ నీటితో పుట్టించాడు.

మనిషి: జంతువు దశలో నుంచే మనిషి వచ్చాడంటారు కదా?

ఉషస్సు: వట్టి ఊహాజనిత ఆలోచన మాత్రమే తప్ప ఇందులో ఇసుమంతటి నిజం లేదు. ఈ సృష్టిలో సమస్తం దేవుడు 6 రోజుల్లో సృష్టించాడు.

మనిషి: సృష్టికి సంబంధించిన సమాచారం చాలానే ఉన్నట్టనిపిస్తోంది.

ఉషస్సు: ఈ వెలుతురు అసలయిన వెలుతురు కాదన్నావు, నిజమే. ఆ అఖండజ్యోతిని కనుక్కోవాలంటే సృష్టి నిర్మాణం గురించి

యోచించడం ఒక్కటే మార్గం.ఈ ప్రపంచం ఒక మిథ్య అనంటారు చాలా మంది. దీనికి భిన్నంగా విద్వాంసులు, వివేచనా పరులు **'ఈ లోకం పరలోక పంట పొలం'** అంటారు. ఈ లోకం, లోకంలోని సమస్తం ఏదో ఒకనాడు నశించక తప్పదు. దీనికతీతంగా శాశ్వతమయిన మరో లోకం ఉంది. అదే పరలోకం అదే స్వర్గం. అదే పరమాత్మ దర్శనంతో పునీతమయ్యే జగం. అదే అసలయిన వెలుతురు. మనకు కనపడే ఈ బయటి వెలుతురు కొంత కాలానికి ఆరిపోతుంది. కానీ ఆ అఖండ జ్యోతి అక్షరంగా, అద్వితీయంగా నిలుస్తుంది. అసలైన వెలుతురంటే మనిషి ఆ అఖండ జ్యోతీశ్వరుణ్ణి చేరుకోవడమే.

మనిషి: తెలిసింది. వెలుతురెక్కడుందో నాకర్థమయ్యింది. ఇన్నాళ్ళు నిద్రపోతున్న వివేకం కనులు విప్పింది. నా చిరకాల అన్వేషణకు లక్ష్యం దొరికింది. ఓహో! ఎంత తీయని అనుభూతి! నా హృదయ వాటికలో వెలుతురు మొగ్గలు కిలకిలా నవ్వుతున్నాయి. నా జ్ఞానేంద్రియాలు, పంచేంద్రియాలు–సర్వేంద్రియాలు పరిమళిస్తున్నాయి, పరవశిస్తున్నాయి. ఆత్మకు మాత్రమే దృశ్యమ్మగు అక్షర వాహిని అది.

(తన్మయత్వంలో) ఓహోహో! ఎంత దివ్యంగా ఉందీ సన్నివేశం!! నిత్యం ఇలాంటి మనో స్థితే ఉంటే ఎంత బాగుండు!! ఇన్నాళ్ళూ నేను మాయ జగత్తులోనే జీవించాను. ఇప్పుడు నా మనసుకు చుట్టుకున్నా మాయావలయం పటాపంచలయింది. ఈ సత్యాకాంతుల తళతళలు, నాలో ఏదేదో దురాలోచనలను రేకెత్తించిన తమస్సులను కడిగివేస్తున్నాయి. ఇందుకేనేమో **'మనిషి సత్కర్మల్ని బట్టి వారికి జ్యోతులివ్వబడతాయి'** అని మహాప్రవక్త (స) వారు అన్నది అంటూ సర్వలోక సృష్టికర్తను మొరపెట్టుకోనారంభిస్తాడు మనిషి:

దేవా! నా హృదయం జ్యోతిర్మయం అవ్వాలి. నా నయనం కాంతులీనాలి. నా శ్రవణం వెలుగులు నిండాలి. నా చుట్టూ ప్రక్కల వెలుగు దివ్వెలు వెలగాలి. నా వదనం ప్రకాశమానం అవ్వాలి. నా నరాల్లో నవ నాడుల్లో, నా కండరాల్లో, రక్తంలో రోమంలో, చర్మంలో ఆంతర్యంలో – అంతటా కాంతి కమలాలు విరియాలి. నా జీవితం వెలుగు వెన్నెల్లో తడి స్నానాలు చేయాలి. నా నలువైపుల కాంతి కిరణాలు విరజిమ్మాలి. నా మేధ కాంతితోనూ, నా మది శాంతితోనూ ఉప్పొంగాలి. నేను నిన్ను చేరాలి. నీ దివ్య దర్శనంతో నా జన్మ ధన్యమవ్వాలి. ఆమీన్!

telgo fbrvry.indd 19 3/11/12 11:55 AM

డా. జాకిర్ నాయక్

బహు భార్యాత్వం – 2

ఉదాహరణకు స్త్రీ పురుషుల జన సంఖ్యలో ఉండే వ్యత్యాసాన్ని చూపించటానికి, ఇన్‌సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా(1987)లో పేర్కొన్న కొన్ని పాశ్చాత దేశాల గణాంకాల్ని ఈ క్రింద పేర్కొనటం జరిగింది:

వ.	దేశం	పరుషుల శాతం	స్త్రీల శాతం
1.	ఆస్ట్రేలియా	47.7%	52.93%
2.	బర్మా	48.81%	51.19%
3.	జర్మనీ	48.02%	51.98%
4.	ఫ్రాన్స్	48.99%	51.01%
5.	ఇటలీ	49.89%	51.11%
6.	పోలాండ్	48.61%	51.39%
7.	స్పెయిన్	48.94%	51.06%
8.	స్విట్జర్లాండ్	48.67%	51.33%
9.	సోవియట్ యూనియన్	46.59%	53.41%
10.	అమెరికా సంయుక్త రాష్ట్రాలు	48.58%	51.42%

1987 గణాంకాలననుసరించి, అమెరికా జనాభాలో పురుషులకన్నా (7.8 మిలియన్స్) దాదాపు (78) లక్షల స్త్రీలు అధికంగా ఉన్నారు. దీన్ని విశ్లేషిస్తే తేలేదేమంటే, అమెరికా లోని ప్రతి ఒక్క పురుషుడు వివాహం చేసుకున్నప్పటికీ, అమెరికాలో, (78) లక్షల స్త్రీల కు వివాహం, అవివాహితుడైన పరుషుడు దొరకటం దుర్లభవం.

(అనువాదకుడు)

5. పాపలున్న గర్భాల్ని తీసివేయటం మరియు భ్రూణ హత్యల కారణంగా భారత దేశంలో పురుషుల సంఖ్య స్త్రీల కన్నా అధికం గా ఉంది.

పరుషులకన్నా తక్కువ సంఖ్యలో స్త్రీలున్న కొన్ని దేశాల్లో భారతదేశం ఒకటి. దీనికి ముఖ్య కారణం ఏమిటంటే పాపల్ని భ్రూణహత్యల ద్వారా అంతం చేస్తున్నారు. ఇంకా ప్రతి సంవత్సరం మన దేశంలో దాదాపు పది లక్షల గర్భస్రావాలు జరుగుతున్నాయి. అంటే గర్భంలో నున్నది పాప అని తెలిసిపోగానే, గర్భస్రావం ద్వారా అట్టి గర్భాల్ని దించేస్తున్నారు. ఒకవేళ భారతదేశంలో క్రూరమైన ఈ పద్ధతిని నిషేధిస్తే, ఇక్కడ కూడా పురుషులకన్నా స్త్రీల సంఖ్య పెరిగిపోతుంది.

6. విశ్వ వ్యాప్తంగా స్త్రీల సంఖ్య పురుషుల కన్నా అధికంగా ఉంది.

అమెరికాలో, పురుషుల కన్నా స్త్రీలు, 78 లక్షలు అధికంగా ఉన్నారు. కేవలం ఒక్క న్యూయార్క్‌లోనే, పది లక్షల మంది స్త్రీలు, పురుషులకన్నా అధికంగా ఉన్నారు. అంతేకాదు న్యూయార్క్‌లోని పురుషుల్లో మూడోవంతు భాగం స్వలింగ సంపర్కానికి అలవాటుపడిన వారున్నారు. ఇక మొత్తం అమెరికాలో స్వలింగ సంపర్కమనే ఈ జాడ్యంలో ఇరుక్కున్న వారి సంఖ్య రెండుకోట్ల యాభై లక్షలు. అంటే వీరు స్త్రీలతో వివాహం చేసుకోవటానికి ఇష్టపడేవారు కాదు.

గ్రేట్ బ్రిటన్‌లో స్త్రీల సంఖ్య పురుషుల కన్నా నలభై లక్షలు అధికంగా ఉంది. జర్మనీలో వీరి సంఖ్య యాభై లక్షలుంటే, రష్యాలో తొంభై లక్షలకు పైనే ఉంది. ప్రపంచమంతా కలిసి, పురుషుల కన్నా స్త్రీలు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉన్నారనే విషయం ఆ దేవునికే తెలుసు.

7. పురుషున్ని, కేవలం ఒకే భార్యకు పరిమితం చేయటం ఆచరణ సాధ్యం కాని విషయం .

ప్రతి పురుషుడు కేవలం ఒకే భార్యను కలిగి ఉండాలని కట్టడి కనుక చేసినట్లయితే, కేవలం ఒక్క అమెరికాలోనే దాదాపు మూడు కోట్ల మంది స్త్రీలు అవివాహితులుగానే ఉండిపోవలసి వస్తుంది. (దీనికి కారణం ఏమిటంటే అక్కడి పురుష జనాభాలో రెండున్నర కోట్ల మంది స్వలింగ సంపర్కాన్ని ఆశ్రయించి ఉన్నారు. వారసలు స్త్రీలను వివాహమాడటానికే సిద్ధంగా లేరు). బ్రిటన్‌లో నలభై లక్షలు, జర్మనీలో యాభై లక్షలు, మరియు రష్యాలో తొంభై లక్షల స్త్రీలకు భర్తలే లభించరు. ఉదాహరణకు మీ చెల్లెలో, నా చెల్లెలో అవివాహితురాలనుకోండి. ఆమె అమెరికా పౌరసత్వం కూడా కలిగి ఉంది. ఇంకిప్పుడు ఆమెకు రెండే రెండు మార్గాలున్నాయి. వివాహితుడైన పురుషుడ్ని వివాహమాడి, రెండవ భార్యగా ఉండటం ఒక మార్గమైతే, జీవితాంతం అవివాహితగానే గడిపివేయటం రెండో మార్గం, అయితే ఈ రెండో మార్గంలో ప్రతి క్షణం, కాలుజారి చెడు త్రోవల్లో పడిపోయే ప్రమాదముంటుందనే విషయాన్ని మరువరాదు. ఇంగిత జ్ఞానం ఉన్న, సౌశీల్యాన్ని కాంక్షించే ప్రతి స్త్రీ మొదటి పద్ధతినే కోరుకుంటుంది.

పాశ్చాత సమాజాల్లో భార్య మాత్రం ఒక్కటే ఉండి, అనేక మంది పరస్త్రీలతో అక్రమ సంబంధాలు కలిగి ఉండటం చెలామణిలో ఉంది. ఫలితంగా ఇలాంటి స్త్రీలు అసురక్షితమైన, అవమానకరమైన జీవితాన్ని గడపవలసిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ సమాజ ఆలోచనా సరళిని పరిశీలించండి. ఇదే సమాజం ఒక వ్యక్తికి, ఒకరికంటే అధికమంది భార్యలుండటాన్ని సహించజాలదు. అలా అనుమతించి ఉన్నట్లయితే, ఇలాంటి స్త్రీలు సమాజంలో ఆదరణనీయమైన, గౌరవప్రదమైన మరియు సురక్షితమైన జీవితం గడుపుతుండేవారు కదా!

ఇవి కొన్ని మాత్రమే. ఇంకా ఇలాంటి అనేక కారణాల దృష్ట్యా, ఇస్లాం కొన్ని షరతులతో కూడిన పరిమిత బహుభార్యాత్వానికి అనుమతినిస్తుంది. కాని ఈ అనుమతిలో దాగివున్న మూల కారణం మాత్రం స్త్రీ యొక్క ఆదరణ, గౌరవాల్ని కాపాడుతూ, ఆమెకు రక్షణ కల్పించడమే.

telgo fbrvry.indd 20 3/11/12 11:55 AM

మూడు మంచి లక్షణాలు

1) కోపం వచ్చినప్పుడు అన్యాయానికి, అక్రమానికి, దౌర్జన్యానికి, దుర్మార్గానికి ఒడిగట్టకుండా ఉండగలగటం.

2) సంతోష సమయంలో శృతి మించకుండా, దైవా భిష్టానికి అనుగుణమగా ఉండగలగటం.

3) కలిమి, బలిమి ఉన్నా - తనది కాని వస్తువు జోలికి పోకుండా ఉండగలగటం.

ఆంధ్ర ప్రదేశ్ గురించి

* State Language -Telugu	తెలుగు
* State Symbol - Poorna Kumbham	పూర్ణ కుంభం
* Statesong - Mana Telugu Talliki	మా తెలుగు తల్లికి
*State Animal - Black Buck	కృష్ణ జింక
* State Bord - Indian Roller	పాల పిట్ట
* State Tree - Neem	వేప
* State Sport - Kabaddi	చెడుగుడు
* State Dance - Kuchipodi	కూచిపూడి
* State Flower - Water Lily	కలువ పువ్వు



telgo fbrvry.indd 21 3/11/12 11:55 AM

నెట్ మీద ఇస్లాం గురించి తెలుసుకునేందుకు క్రింది సైట్‌లను సందర్శించగలరు

http://www.islamhouse.com

http://abdurrahman.org

http://www.alislam.org

http://www.islamicbook.ws/telugu

http://www.islamic-resource-centre.org

nelavankaonline.com

ipcblogger.com

www.teleguislamiclit.org

http://www.slideshare.net/syedabdus

http://www.scribd.com/syedabdus